వార్త
ఆదివారం
24 సెప్టెంబరు, 2023

# ప్రేమే నేరమౌనా!



తారాతీరం



# సాయిపల్లవి బాలీవుడ్ ఎంట్రీ!

తెలుగు, తమిళ, మలయాళ భాషలో సాయిపల్లవికి మంచి క్రేజ్ ఉంది. ఏ భాషలోనైనా తనకి నచ్చిన కథలను, పాత్రలను చేయడం ఆమెకు అలవాటు. నచ్చిన కథ వచ్చేంతవరకు ఎదురు చూస్తుంది. అందువల్ల సహజంగానే కాస్త గ్యాప్ వస్తుంటుంది. తెలుగులో 'విరాటపర్వం' తరువాత ఆమెకి అలాంటి గ్యాప్ వచ్చింది. ప్రస్తుతం తమిళంలో ఒక సినిమా చేస్తోంది. ఈ సినిమాలో శివ కార్తికేయన్ జోడీగా కనిపించనుంది సాయిపల్లవి. షూటింగ్ దశలో వున్న ఈ సినిమా తరువాత ఆమె బాలీవుడ్ ఎంట్రీ ఇవ్వనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. బాలీవుడ్ హీరో అమీర్ ఖాన్ తనయుడు జునైద్‌ఖాన్ హీరోగా దర్శకుడు సునీల్ పాండే ఒక సినిమా చేస్తున్నాడు. ఈ సినిమాలో కథానాయికగా సాయిపల్లవిని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఇదే నిజమైతే ఆమెకి బాలీవుడ్‌లో మొదటి సినిమా అవుతుంది. బాలీవుడ్ ప్రేక్షకుల నుంచి ఆమెకి ఎలాంటి రెస్పాన్స్ వస్తుందో చూడాలి మరి.



ఈ సంవత్సరం వసూళ్ల పరంగా కొత్త రికార్డులను నమోదు చేసిన చిన్న సినిమాలలో 'బేబి' ఒకటి. ఇందులో హీరోయిన్‌గా నటించిన వైష్ణవి చైతన్య గ్రాఫ్ ఒక్కసారిగా మారిపోయింది. ఈ ఒక్క సినిమాతో యూత్‌లో ఆమె క్రేజ్ ఓ రేంజ్‌లో పెరిగిపోయింది. యంగ్ హీరోల జోడీగా ఆమె వరుస సినిమాలు చేసుకుంటూ వెళుతుందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఒకటి, రెండు ప్రాజెక్టులలో ఆమె పేరు వినిపిస్తోంది. తాజాగా 'బొమ్మరిల్లు' భాస్కర్ ప్రాజెక్టు విషయంలో ఆమె పేరు తెరపైకి వచ్చింది.

# భాస్కర్ దర్శకత్వంలో 'బేబి' కథానాయిక?

'డీజే టిల్లు' హీరో సిద్ధూ జొన్నలగడ్డతో 'బొమ్మరిల్లు' భాస్కర్ ఒక సినిమా చేయనున్నాడు. ఈ సినిమాలో కథానాయిక పాత్ర కోసం వైష్ణవిని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది.
బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించనున్న ఈ సినిమా నుంచి త్వరలో అధికారిక ప్రకటన రానుంది.

ఆదివారం వార్త
24 సెప్టెంబరు, 2023

## మంచి ముత్యాలు

మంచి పుస్తకాలు చదవటం అంటే గత శతాబ్దాలకు చెందిన గొప్ప వ్యక్తులతో సంభాషించినట్లే.

\- రీన్ డెస్కార్టస్

## విషయ విశేషం

స్టెయిన్డ్ గ్లాస్ కర్టెన్స్.... 4
'సంఘీ'భావం....5
అసంపూర్తిగా డ్రగ్స్ దర్యాప్తు కేసులు
కవర్ స్టోరీ..6
ప్రేమే నేరమౌనా!
శ్రీవారి పల్లకిలో మాణిక్యం..11
ఈవారం కవిత్వం..12
ఊరంటే ఊపిరి..!
చితికిన పసిజీవితాల్లో వెలుగు...14
కథ.. 20
వలపు ఊయల
సాహిత్యం..23
అభ్యుదయ దీపశిఖ 'గుఱ్ఱం జాషువా'
అతిపెద్ద నీటి మార్గం సూయజ్ కాలువ...25
ఉత్తరం దిక్కులో సెప్టిక్ ట్యాంక్ ఉండవచ్చా?...29
ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
వగైరా..వగైరా..

## తాజా వార్తలు


### వ్యాక్సిన్లతో అల్జీమర్స్ దూరం!



అరవై అయిదు సంవత్సరాలకు పైబడిన వృద్ధులకు వ్యాక్సిన్లు ఇవ్వడంవల్ల ఆల్జీమర్స్ ప్రమాదం తక్కువని హూస్టన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ హెల్త్ నిపుణులు పేర్కొంటున్నారు. పసివయసులో ఏ రకంగా వ్యాక్సిన్లు ఇస్తామో, అలాగే మలివయసులోనూ ఇన్ఫెక్షన్లకు సంబంధించిన వ్యాక్సిన్లు ఇస్తే ఆయా సమస్యలూ తద్వారా మతిమరుపూ రాకుండా ఉంటుందట. ముఖ్యంగా న్యూమోనియా, సెప్సిస్, మెనింజైటిస్..వంటి వాటి నుంచి రక్షించే న్యూమోకాకల్ (పిసివీ) వ్యాక్సిన్ ఐదేళ్లలోపు పిల్లలకీ 65 పైబడ్డ వాళ్లకీ అవసరం అంటున్నారు. ఇన్ఫ్లుయెంజా వ్యాక్సిన్ తీసుకున్న వృద్ధుల్నీ, తీసుకోనివాళ్లనీ ఎనిమిదేళ్లఆటు నిశితంగా గమనించినప్పుడు వ్యాక్సిన్ తీసుకోనివాళ్లతో పోలిస్తే తీసుకున్నవాళ్లలో 40శాతం మంది అల్టీమర్స్ బారినపడకుండా ఉన్నారట. వ్యాక్సీన్ల వల్ల రోగనిరోధకశక్తి పెరగడంతో ఆల్జీమర్స్‌కు కారణమ్యే హానికరప్రొటీన్ల ఉత్పత్తి తగ్గుతుంది. దాంతో మెదడు కణాలు దెబ్బతినకుండా ఉంటాయి. షింగల్స్ వంటి వైరల్ ఇన్ఫెక్షన్లు నాడీకణాల్ని దెబ్బతినేలా చేస్తాయి. కాబట్టి వృద్ధాప్యంలోనూ కొన్ని వ్యాక్సిన్లు వేయించుకోవడం మేలు అంటున్నారు.

**ఈ గదులు మీకోసమే..**

ఈ ఫొటో కొంచెం వింతగా కనిపిస్తోంది కదూ!ఇది జపాన్‌లోని ఒక క్యాప్సూల్ హోటల్‌లోనిది. జపాన్‌లో ఇలాంటి హోటళ్లు చాలానే ఉంటాయి. ఈ హోటళ్లలో మనుషులు బస చేయడానికి గదులు కాదు, గూళ్లు ఉంటాయి. ఈ గూళ్లలోనే వస్తువులు పెట్టుకోవడానికి తగిన సౌకర్యాలు కూడా ఉంటాయి. రైళ్లలోని బెర్తుల మాదిరిగా ఒకదానిపైన మరొకటి, ఒకదాని పక్కన మరొకటి ఇలా ఒక్కో హోటల్‌లోను వందలాది గూళ్లు కనిపిస్తాయి. చౌక ధరల్లో వసతి సౌకర్యం కోరుకునే వారికి ఇవి అనువుగా ఉంటాయి. ఇలాంటి క్యాప్సూల్ హోటళ్లు జపాన్‌లో నలభై ఏళ్లకు పైగానే నడుస్తున్నాయి. జపాన్‌లోని తొలి క్యాప్సూల్ హోటల్ 1979లో ప్రారంభమైనప్పుడు కొంతవింతగా చూసేవారు. తర్వాత కాలంలో ఇలాంటి హోటళ్లు విరివిగా ఏర్పడటంతో జనాలు అలవాటుపడిపోయారు.



మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com

# స్టెయిన్డ్ గ్లాస్ కర్టెన్స్








నట్టింట్లో వేసే సోఫా నుంచీ..గోడ మీద పెట్టే ఫొటో ఫ్రేము లేదా పోస్టర్ వరకూ అన్నింటినీ ఏరికోరి ఎంచుకుంటున్న రోజులివి. అలా కోరుకునే వారి అభిరుచికి, ఆసక్తికీ తగినట్లుగా కొత్తకొత్త గృహాలంకరణ వస్తువులు ఎప్పటికప్పుడు మార్కెట్లో సందడి చేస్తూనే ఉన్నాయి. తాజాగా ఆ జాబితాలో చేరినవే ఈ 'స్టెయిన్డ్ గ్లాస్ కర్టెన్లు'. ఒకప్పుడు కర్టెన్లు ఏదో వేశామంటే వేశాం అనుకునే విధంగానే ఉండేవి. రోజులు మారేకొద్దీ ఇంటి అలంకరణకు మ్యాచ్ అయ్యేవిధంగా రకరకాల వస్త్రాల్లో, మనసుదోచే డిజైన్లలో, 3డీ హంగులతో కర్టెన్లను రూపొందిస్తూ వచ్చారు డిజైనర్లు. ఆ కోవలోనే కొన్ని వందల సంవత్సరాల క్రితం అందుబాటులోకి వచ్చిన స్టెయిన్డ్‌గ్లాస్ కళ క్రమంగా కిటికీలూ తలుపులమీదకూ చేరి గృహాలంకరణలో భాగం అయిపోవడంతో దాన్ని ఎప్పటికప్పుడు మరింత కొత్తగా చూపించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు కళాకారులు. అందులో భాగంగానే ఇప్పుడు 'స్టెయిన్డ్‌గ్లాస్ కర్టెన్ల'నూ తీసుకొచ్చేశారు.









# 'సంఘీ' భావం



# అసంపూర్తిగా డ్రగ్స్ దర్యాప్తు కేసులు

మాదక ద్రవ్యాల వినియోగం కేసులో పోలీసుల దర్యాప్తు పూర్తి స్థాయిలో కొనసాగడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికి అనుగుణంగానే ఇప్పటి వరకు నమోదైన కేసులను పరిశీలిస్తే డ్రగ్స్‌తో పెడ్లర్లు దొరికినప్పుడు రెండు మూడు రోజుల పాటు హడావిడి చేయడం ఆ తరువాత క్రమంగా ఈ కేసులు మరు గున పడటం సర్వసాధారణంగా మారింది. ఇప్పటి వరకు హైదరాబాద్ నగరంలో పలు సందర్భాల్లో డ్రగ్స్ లభించాయి. ఈ సమయంలో పెడ్లర్లు అంటే కింది స్థాయిలో డ్రగ్స్‌ను సరఫరా చేసే వారు మాత్రమే దొరుకుతున్నారు. వీరి వద్ద లభించిన కొంతసమాచారం, లభించిన సెల్‌ఫోన్ల నంబర్లపై ఆధారపడి దర్యాప్తును కొనసాగిస్తున్నారు. పెడ్లర్ల స్థాయిని దాటి డిస్ట్రిబ్యూటర్లను గాని, కీలకమైన తయారీదారులు, భారీగా సరుకు రవాణా చేస్తున్న వారు ఇప్పటి వరకు పట్టు పడలేదు. కొన్ని కేసులో రెండో స్థాయిలో సరఫరా చేస్తున్న వారు లభించినప్పటికీ పూర్తి స్థాయిలో ఆధారాలు సేకరించ లేకపోయారు. ప్రధానంగా డ్రగ్స్‌కు బానిసలు అయినవారు, సరఫరా చేసే వారు పలుకుబడి ఉన్న వారు కావడంతో కేసులు ముందుకు కదలడం లేదు. కొన్ని సందర్భాల్లో దర్యాప్తు అధికారులు బదిలీకి గురౌతున్న ఘటనలు అనేకం జరిగాయి. 2017లో ఐపిఎస్ అధికారి అకున్ సబర్వాల్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా డ్రగ్స్ డొంకను కదిపారు. అనేక మంది అగ్ర హీరోలు, తారలు డ్రగ్స్ లావాదేవీలతో సంబంధం ఉందని పేర్కొంటూ వారిని వరుసగా విచారణ కూడా నిర్వహించారు. డ్రగ్స్ సరఫరాలో కీలకంగా వ్యవహ రించిన కెల్విన్‌తో పాటు 13మందిని అరెస్ట్ చేశారు. ప్రముఖ సినీతారలు రవితేజ, ముమైత్‌ఖాన్, రానా, తరుణ్, డైరెక్టర్ పూరీ జగన్నాథ్, నవదీప్, తనీష్‌లతో పలువురు పేర్లు వెలుగులోకి వచ్చాయి. వీరిలో కొందరిని ప్రశ్నించారు. బిగ్‌బాస్ షోలో ఉన్న ముమైత్‌ఖాన్‌ను సైతం అక్కడి నుంచి రప్పించి విచారించారు. అప్పట్లో ఈ కేసు సంచలనంగా మారింది. క్రమంగా ఈ కేసు మరుగున పడిపోయింది. అకున్ సబర్వాల్ కూడా బదిలీ కావడంతో ఈ కేసుకు ఫుల్‌స్టాప్ పడింది. ఈడీ అధికారులు రంగంలో దిగి మరోసారి వీరందరికీ నోటీసులు ఇచ్చినా ఆ తరువాత కేసు గురించి మరిచిపోయారు. దీనితో పాటు ప్రతి సంవత్సరం డ్రగ్స్‌కు సంబంధించిన కేసులు నమోదు అవుతున్నాయి. అయితే వాటిని కొంతకాలం పాటు హడావిడి చేసి వదిలి వేస్తున్నారు. ప్రధానంగా ఈ వ్యవహారం లో కిందిస్థాయిలో ఉన్న పెడ్లర్లు, డ్రగ్స్‌కు అలవాటు పడిన కొందరు వ్యక్తుల పేర్లు మాత్రమే వెలుగులోకి వస్తున్నాయి. డ్రగ్స్ సేవించే వారు బాధితులు కాబట్టి వారిని నేరస్తులుగా పరిగణించే అవకాశం ఉండదు. సంవత్సరం వరకు జైలు శిక్ష, లక్ష రూపాయల లోపు జరిమానా మాత్రమే విధిస్తారు. పరిధికి మించి అత్యధికంగా డ్రగ్స్ సేవించే వారిపై అదనపు సెక్షన్లతో కేసులు నమోదు చేసే అవకాశం ఉంటుంది. కేసు దర్యాప్తు సమయంలో రక్త నమూనాలు, వెంట్రుకలు, గోళ్లు వంటివి ఫోరెన్సిక్ లాబ్‌కు పంపిస్తారు. ల్యాబ్‌లో పరీక్షలు జరిపిన తరువాత వారు డ్రగ్స్ సేవిస్తున్నారా లేదా అన్న విషయం నిర్ధారణ అవుతుంది. ప్రస్తుతం 1985లో వచ్చిన నార్కొటిక్ అండ్ డ్రగ్స్ సైకోట్రోపిక్ సబ్‌స్టెన్స్ చట్టాన్ని అనుసరిస్తూ దర్యాప్తును కొనసాగిస్తున్నారు. ఈ మేరకు వారికి శిక్షలు పడేందుకు దర్యాప్తు విభాగాలు కృషి చేస్తున్నాయి. డ్రగ్స్ పరిధిలోకి ఎంఫిటమిన్, చరస్, కొకయిన్, గంజాయి, హెరాయిన్, ఎల్ఎస్‌డి, మెథడోన్, మొర్ఫిన్, ఓపిఎం వంటివి వస్తాయి. ప్రతి ఏటా సుమారుగా తెలంగాణలో 5 వందలకు మించి కేసులు నమోదు అవుతున్నాయి. 2017, 2020, 2021లలో అధిక కేసులు నమోదు అయ్యాయి. గోవాతో పాటు ఇతర దేశాల నుంచి మాదకద్రవ్యాలు దిగుమతి అవుతున్నాయి. స్థానికంగా కొందరు ఔషధాలలో ఉపయోగించే మందులను తీసుకుని డ్రగ్స్ తయారు చేస్తున్నారు. డ్రగ్స్ పెడ్లర్స్‌ను పట్టుకున్న సమయంలో అతని వద్ద లభించిన సమాచారంతో పోలీసులు పలువురికి నోటీసులు జారీ చేసి విచారిస్తున్నారు. ముఖ్యంగా బంజారాహిల్స్‌లోని ఒక పబ్‌లో లభించిన సమాచారంతో 148 మందికి నోటీసులు ఇచ్చి విచారించారు. అయితే దానికి సంబంధించి తదుపరి చర్యలు తీసుకోలేదు. దర్యాప్తు అధికారులు బదిలీ కావడంతోనే ఈ కేసులు మరుగున పడిపోతున్నాయి. ప్రస్తుతం నూతన సంవత్సరం వేడుకలకు వందల కోట్ల రూపాయల విలువైన మాదక ద్రవ్యాలు అందుబాటులోకి వస్తున్నాయి. పబ్‌లు వీటి విక్రయాలకు ప్రధాన కేంద్రాలుగా ఉన్నాయి. అక్కడికి వచ్చే ఖాతాదారులకు పబ్ యాజమాన్యాలు డ్రగ్స్‌ను అందిస్తున్నాయి. పలు పబ్‌లలో ఈ విధంగా సరఫరా జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందుతోంది. డ్రగ్స్ వ్యవహారంలో పెద్దలు ఉండటంతో పోలీసులు దర్యాప్తు చేసేందుకు వెనుకంజ వేస్తున్నారు. సీనియర్ ఐపిఎస్ అధికారులకే బదిలీలు తప్పడం లేదు అన్న భావన పలువురు పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. కింది స్థాయిలో పెడ్లర్లను, డ్రగ్స్ సేవిస్తున్న బాధితులను పట్టుకోవడం కంటే ఈ మాఫియాలో కీలక వ్యక్తులను పట్టుకుని చట్టం ముందు పెడితే ఆశించిన ఫలితాలు కనిపిస్తాయి. దేశ, రాష్ట్ర సరిహద్దులు దాటి డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నా కఠినంగా ఈ వ్యవహారాలను అణచివేసే ప్రయత్నం మాత్రం జరగడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# ప్రేమే నేరమౌనా!

కవర్ స్టోరీ
కనుమ ఎల్లారెడ్డి

**ప్రేమ** అందమైన ఓ మధురభావన. మరపురాని తీయదనం. మదినిండా నిండుకునే అనురాగదీపం. ప్రేమ ఉప్పొంగిపోదు, అపకారం తలపెట్టదు. తన భాగస్వామి క్షేమాన్నే కోరుతుంది. మరి ఇప్పటి ప్రేమల మాటేమిటి? నేను ప్రేమిస్తే..నువ్వు ప్రేమించి తీరాల్సిందే. లేకపోతే నీ అంతుచూస్తా.. నాకు దక్కనిది మరెవరికీ దక్కకూడదనే స్వార్థపూరిత విషభావాలకు సమిధలైపోతున్న వనితలెందరో..ఫేస్‌బుక్ ప్రేమలు, ట్విట్టర్‌ల పరిచయం, పెళ్లిపీటలకు ఎక్కకముందే గాయపడుతున్న హృదయం, ముక్కలైపోతున్న మనసు, ఛిద్రమైపోతున్న బతుకులు. ఇవే కదా ఎక్కడ చూసినా వార్తలు.

## పెరుగుతున్న ప్రేమోన్మాదపు దాడులు

ఇటీవల సోషల్‌మీడియా ప్రేమలు ఎక్కువైపోతున్నాయి. ఇవి ఎంతకాలం నిలబడతాయో తెలియదు. ఇలాంటి ప్రేమల్లో మంచికంటే కీడే అధికంగా జరుగుతుంటాయి. కానీ యువత ఈ మాయజాలం సుడిగుండంలో చిక్కుకుని సాలెగూడులా అల్లుకుని విలవిల్లాడుతున్నది. ప్రారంభంలో అంతా కొత్తగా, గమ్మత్తుగా, మధురంగా అనిపించినా, కుటుంబ నేపథ్యం, బ్యాగ్రౌండ్ ఏమీ తెలియకుండానే ప్రేమమత్తులో మునిగి, ఆ తర్వాత నిజం తెలుసుకుని, దూరం పెట్టాలనుకునే ప్రయత్నంలోనే ఉన్మాదుల చేతుల్లో బలైపోతున్న యువతుల సంఘటనల్ని మనం చూస్తున్నాం. నేటి సమాజంలో చాలావరకు ప్రేమ వివాహాలు, కులాంతర, మతాంతర వివాహాలు ఎక్కువైనాయి. కులాంతర వివాహాల లో ఎక్కువగా అగ్రకులాలవారు సమాజంలో తమను తక్కువ చూస్తారు అనే దృక్పథంతో కన్నవారే తమ పిల్లలను మట్టుబెడుతున్నారు. కొన్ని సందర్భాలలో పిల్లలే పెద్దలకు చెప్పలేక అర్థాంతరంగా తమ ప్రాణాలు తీసుకుంటున్నారు. ప్రేమ పెళ్లి చేసుకున్నవారు ఎవరో కొద్దిమంది మాత్రమే తమ వైవాహిక జీవితాన్ని అర్థవంతంగా గడుపుతున్నారు. చాలా ప్రేమ వివాహాలు పేలవంగా వుంటున్నా యి. ప్రేమ వివాహాలు చేసుకోవడం తప్పు కాదు. అయితే అందుకు దారి తీసిన పరిస్థితులు అన్వేషించాలి. ఇద్దరూ కలసి నిర్ణయం తీసుకున్నారంటే అది కలకాలం ఉండాలి. ఏదో కొంత కాలం ఉబుసుపోక కాలక్షేపం వివాహాలు చేసుకుని తమలో తమకు పొసగక విడిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఇది ఎక్కువగా ఐ.టి. ఉద్యోగు లలో జరుగుతోంది. సహజీవనం చేయ దం, విలాసవంతమైన జీవితం గడపటం తర్వాత వేరైపోవడం సర్వసాధారణ మైంది. దీనికి కారణం ఎవరు? అని ప్రశ్నించుకుంటే వారే అని చెప్పక తప్పదు. ఇది సమాజం హర్షిస్తుందా? లేదా? అనే ఆలోచనే వారికి ఉండదు. వారికి కావలసింది సుఖవం తమైన, సౌకర్యవంత మైన జీవితం. ఎవరు ఏమైపోతే మాకేం అనే ధోరణిలో ఉన్నారు. వీరికి సలహాలు ఇస్తే మాకు అన్నీ తెలుసు అనే నిర్లక్ష్య ధోరణి కనపడుతోంది. ప్రేమ వివాహాలు కొన్నిసార్లు హత్యలకు దారితీస్తున్నది. వివాహం చేసుకోవడం, కొంత కాలం ఎంజాయ్ చేయటం, తద్వారా ఇద్దరి మధ్య పొరపొచ్చలు వస్తున్నాయి. వారిమధ్య సయోధ్య కుదుర్చే పెద్దలు లేకపోవడంతో సర్దుకునే ఓర్పు, నేర్పు లేక క్షణికావేశంలో చంపడమో, ఆత్మహత్య చేసుకోవడమో జరుగుతున్నాయి. ఈ దిశలో తమ పిల్లల భవిష్యత్ గురించి ఆలోచించడం లేదు. తద్వారా పిల్లలు అనాథలై సమాజానికి ఓ సవాల్‌గా నిలుస్తున్నారు. తమ ప్రేమను నెగ్గించుకునేందుకు ఎంతకైనా తెగిస్తున్నారు. ఢిల్లీలో గత సంవత్సరం మే 18న శ్రద్ధావాకర్‌ను ఆమె ప్రియుడు హత మార్చి, శరీరాన్ని ముక్కలుగా చేసిన సంఘటన సంచలనం రేపింది. ఈ హత్య ఉదంతం తర్వాత దేశంలో ఇలాంటి సంఘటనలు పెరగడం పోలీసులకే సవాలుగా మారింది. ఆమె శరీర భాగాలను ఫ్రిజ్‌లో పెట్టి, విడతల వారీగా నగరంలో పడేశాడు ఆమె ప్రియుడు. యువత ఎటు పయని స్తోందో అర్థం కాని అయోమయస్థితికి నేటి సమాజం చేరుకోవడం సిగ్గుచేటు. హైటెక్ నాగరికతలో మానవత్వమే మంటకలిసిపోతున్నది. నిజమైన ప్రేమ ఏదో నకిలీ ప్రేమ ఏదో తెలుసుకోలేని స్థితిలో నేటి అమ్మాయిలు అబ్బాయిలు ఉన్నారు. పీకలోతుప్రేమల్లో పడి, తర్వాత విభేదాలు వస్తే, వాటిని భరించే శక్తి, మనోనిబ్బరం ఉండడం లేదు.

## సంచలనం రేపిన కోరుట్ల ఘటన



తెలంగాణలోని జగిత్యాల జిల్లా కోరుట్లలో అక్కను చెల్లెలే హతమార్చడం తీవ్రసంచలం రేపింది. ముస్లిం యువకుడిని ప్రేమించిన చెల్లెలు తన ప్రియుడిని పెళ్లాడేందుకు అక్కను చంపి, ఇంట్లో నుంచి నగదు, నగలను తీసుకెళ్లిపోయింది. ప్రేమ కోసం కుటుంబ అనుబంధాలను వద్దనుకున్న చెల్లెలు చివరికి అక్కను హత్య చేసేంతగా ప్రేమమత్తులో మునిగిపోయింది. చెల్లి చేతిలో హతమార్చబడిన అక్క దీప్తి బిటెక్ పూర్తి చేసి ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. ప్రస్తుతం ఇంటి దగ్గర నుంచే విధులు నిర్వహిస్తోంది. చెల్లెలు ఇంజినీరింగ్ చదివే క్రమంలో ఓ ముస్లిం యువకుడి ప్రేమలో పడింది. పెళ్లి చేసుకుందామని ప్రియుడిని చాలాసార్లు అడిగింది. అయితే ఉద్యోగం లేకపోతే జీవించడం కష్టమని చెప్పాడు అతడు. చెల్లెలు ఆలోచించి "మా ఇంట్లో బంగారం, చాలా డబ్బు ఉందని చెప్పింది. ఆ డబ్బు, బంగారం తీసుకునివెళ్లి ఎక్కడైనా బతుకుదాం" అని చెప్పడంతో ప్రియుడు అందుకు సిద్ధం అయ్యాడు. చివరికి ఒకరోజు తల్లిదండ్రులు ఇంట్లో లేకపోవడం చెల్లెలు అనుకున్న ప్లాన్ ప్రకారమే జరిగింది. అక్కకు ఓడ్కా తాగించి, ప్రియుడిని రాత్రి 2 గంటల సమయంలో రప్పించింది. డబ్బు, బంగారం తీసుకుంటున్న సమయంలో వాళ్ల చేసిన అలికిడికి దీప్తి కళ్లు తెరచి నిర్ఘాంతపోయింది. దీప్తి లేవబోతుండగా నోటికి ప్లాస్టర్ వేశారు చెల్లెలు, ఆమె ప్రియుడు. ఈ పెనుగులాటలో దీప్తిని చంపేశారు. అప్పటికప్పుడు చెల్లెలు తన ప్రియుడితో ఉడాయించింది. చివరకు పోలీసుల విచారణలో ఆమె ఎట్టకేలకు నిజం ఒప్పుకుంది. హత్యకు సహకరించిన ప్రియుడు, అతడి తల్లి, చెల్లెలు, స్నేహితుడు కూడా ఈ సంఘటనలో నిందితులుగా ఉన్నారు. ఈ సంఘటన ముఖ్యంగా అనురాగాలకు, స్నేహబంధాలకు విలువ లేకుండా పోయిందని నిరూపించింది. అటు ప్రియుడి కుటుంబం కూడా ఇది తప్పు అని తమ కుమారుడికి చెప్పలేకపోయింది. చెల్లి సొంత రక్తసంబంధం పంచుకుపుట్టిన అక్కను, ప్రేమ కోసం చంపడం పెను సంచలనం సృష్టించింది. మన కుటుంబ వ్యవస్థ ఎలాంటి దుస్థితికి చేరుకుంటున్నాయో తెలియచేస్తున్న ఉదంతం ఇది. ప్రేమ కోసం ఎంతకైనా తెగించేందుకు కూడా సిద్ధపడుతున్న ఇలాంటివారిని ఏమనాలి? ప్రేమ ఉన్మాదంలో ఎలాంటి అరాచకాలను చేసేందుకు కూడా వెనుకాడడం లేదు. తమ బిడ్డలు గొప్ప చదువులు చదివి, మంచి ఉద్యోగం చేసి, తమ జీవితాలను ఆదర్శప్రాయంగా చేసుకుంటారని కలలు కన్న తల్లిదండ్రులకు ఒక కూతురు చనిపోవడం, మరో కూతురు జైల్లో ఉండడం ఎంతటి వేదనను మిగిల్చిందో గ్రహించలేం. దీనికి ఎవరు బాధ్యులంటే ప్రేమ ఆ స్థితికి చేరుస్తుందా? వ్యక్తులలో విచక్షణ కోల్పోయేటట్లు చేస్తోందా?



## ఉలిక్కిపడ్డ ఎల్‌బినగర్ హత్య

హైదరాబాద్‌లోని ఎల్‌బినగర్‌లో ఓ యువకుడు తనను పెళ్లిచేసుకునేందుకు నిరాకరిస్తోందనే కారణంతో ఇంట్లోకి జొరబడి అడ్డొచ్చిన తమ్ముడిని చంపి, అక్కను చంపబోయాడు. సమయానికి పక్కింటి మహిళ రావడంతో ఆ యువతి ప్రాణాలు దక్కాయి. అసలు ఆ అమ్మాయి ప్రమేయం ఏమాత్రం లేకపోయినా ప్రేమించమని వెంటబడి, చివరికి ఇలాంటి దారుణానికి ఒడిగట్టాడు. తన ప్రేమ నిరాకరించిందనే కక్షతో ప్రేయసినే హతమార్చేందుకు సిద్ధపడ్డ ఈ ఉన్మాదిని ఏం చేయాలి? రాఖీ కట్టించుకున్న తమ్ముడు అక్కకోసం తన ప్రాణాలనే త్యాగం చేసిన తమ్ముడి ప్రేమ గొప్పది. అందుకే ప్రేమ ఓ పాశం అని కూడా చెబుతారు. గతనెల ఆగస్టులో ప్రకాశం జిల్లా, దర్శి మండలం, బొట్టపాలెంలో దళిత యువతి, అగ్ర కులం అబ్బాయిని వివాహం చేసుకుందని, తమ పరువు పోయిందని అబ్బాయి తరపువారు దాడి చేయడం దేనికి సంకేతం? అబ్బాయి, అమ్మాయి ఇష్టపడే వివాహం చేసుకున్నారు. దీనికి అబ్బాయి తరపువారు ఇష్టపడకపోవడంతో దాడి చేశారు. కులం లేదు, మతం లేదు అని సమాజం ఘోషిస్తున్నా అగ్ర కులాల వాళ్లపై పైశాచిక ఉన్మాదం ముందు ప్రేమ నిలబడలేకపోయింది. చట్టాలు ఉన్నా అవి నిరుపయోగం. కొద్ది రోజులు జైల్లో ఉండి వస్తారు. ఇవన్నీ ఒక ఎత్తయితే దెందులూరుకు చెందిన తేజోమూర్తి, ప్రియాంక వాళ్ల వైవాహిక జీవితానికే మచ్చ. ప్రేమించి పెళ్లి చేసుకున్న వారి మధ్య ఎనిమిది సంవత్సరాలుగా ప్రేమ వ్యవహారం నడిచింది. ఇటీవలే వివాహం కూడా చేసుకున్నారు. అయితే 3 నెలలు తిరగక ముందే భార్య వేధింపులతో

తేజోమూర్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇప్పుడు ఆ భార్య పరిస్థితి? ఇద్దరు ఇష్టపడే వివాహం చేసుకున్నారు. కలిసి జీవించాలని నిర్ణయించుకుని, పెళ్లి చేసుకున్న తర్వాత ఎందుకని సంతోషంగా బతకలేకపోతున్నారు? కుటుంబ సమస్యలు వస్తుంటాయి. వాటిని పరిష్కరించుకునే నైపుణ్యం ఉండాలే తప్ప చావడం, చంపడం సమంజసీయం కాదు కదా! ఇలా చంపడం, ఆత్మహత్య చేసుకోవడం వల్ల కన్నవారికి జీవితాంతం కడుపుకోతను మిగుల్చుతున్నారు.

అలాగే ఒక కానిస్టేబుల్ భార్య ప్రియుడి మోజులో పడి, అతనికి ఇష్టమైన వంట చేసి, మద్యం తాగించి, ప్రియుడితో కలిసి హతమార్చింది. ఇలా ఇష్టపడి పెళ్లి చేసుకున్న దంపతులు కలకాలం జీవించలేనంత పగ, ద్వేషం ఎందుకు పెరుగుతోంది? ప్రేమ కోసం, ప్రేమించి ఇష్టపడి వివాహం చేసుకున్నవాళ్ల హతమార్చడంలో ఆడ, మగ అతీతులు కారు.



మోజు ఉన్నంతవరకు కలిసి జీవించడం తర్వాత విడిపోయి, ఎవరిదారి వారు వెతుక్కోవడం వంటి విదేశీసంస్కృతి మనదేశంలో చాలావేగంగా పాకిపోతున్నది. కుటుంబ వ్యవస్థలే చిన్నాభిన్నమవుతున్నాయి. విదేశీయులు మనదేశ కుటుంబ వ్యవస్థను చూచి, వారు మన కుటుంబవిధానాలను ఆదర్శంగా తీసుకుంటున్న తరుణంలో మనం ఆ వ్యవస్థలే నాశనం చేస్తున్నాం. దీనికంతటికీ కారణం సహజీవనం పేరుతో కుటుంబసభ్యులకు, సమాజానికి దూరంగా జీవించడం వల్ల, మనస్పర్థలు వచ్చినప్పుడు వీరికి సర్దిచెప్పే పెద్దరికం లేక, సూచనలు, సలహాలను ఇచ్చేవారు లేక, ప్రోత్సహించేవారు, మందలించేవారు లేకపోవడం వల్ల క్షణికావేశంలో చంపడమో, చనిపోయిడమో చేస్తున్నారు.



తాను ప్రేమించిన యువత పెళ్లికి నిరాకరిస్తోందని విశాఖపట్నంలో ఓ యువకుడు తన ప్రియురాలిపై బ్లేడుతో దాడికిపాల్పడ్డాడు. తర్వాత అతను కూడా గాయం చేసుకున్నాడు. ప్రస్తుతం ఇద్దరూ చికిత్స తీసుకుంటున్నారు.

వీటికి పరిష్కారం లేదా?

ప్రతి సమస్యకు తప్పకుండా పరిష్కారం అనేది ఉంటుంది. సోషల్‌మీడియా మాయలో పడి అమ్మాయిలు, అబ్బాయిలు ప్రేమపేరుతో జరుగుతున్న మోసాలపై జాగ్రత్తలు వహించాలి. ప్రత్యేకంగా ఆడపిల్లలు టైమ్‌పాస్ కోసమో, లేక మరో ఉద్దేశంతో అబ్బాయిలతో చనువు పెంచుకోవడం కాని, వారితో వ్యక్తిగతంగా ఫొటోలు తీసుకోవడం వంటివి చేయకూడదు. అలాగే మీరు ప్రేమించే వారు ఎలాంటివారో పూర్తిగా తెలుసుకోవాలి. ప్రేమ గుడ్డిదని అంటారు. కానీ ఇందులో నిజం లేదు. ప్రేమ ఆకర్షణలకు గురయ్యేది కాదు. ప్రేమ శాశ్వితకాలం నిలబడేది. కాబట్టి అన్ని తెలుసుకున్న తర్వాత మీ ప్రేమను ముందుకు సాగనివ్వండి. లేకపోతే ఆరంభంలోనే దాని కట్‌చేసుకుంటే శ్రేయస్కరం. అలాగే తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు కాలేజీలకు సక్రమంగా వెళ్తున్నారా? లేదా? అని ఆరాతీస్తుండాలి. పిల్లలు ఎదిగినప్పుడు వారిని నిత్యం గమనిస్తూ ఉండాలి. చెడువ్యసనాలకు గురికాకుండా చూడాలి. అలాగే ప్రేమ విషయాల్లో కూడా వారితో చర్చించాలి. తమ బిడ్డలతో తల్లిదండ్రులు స్నేహితుల్లా మెలగాలి. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో వైసిపి ఎమ్మెల్యే రాజమల్లు శివప్రసాద్‌రెడ్డి తన కూతురుకి దగ్గరుండి ప్రేమ పెళ్లి జరిపించాడు. పెద్దల్ని ఒప్పించేలా మీ ప్రేమలు ఉండాలి. ఒకవేళ ఒప్పుకోకపోయినా అన్నివిధాలా మీకు మీ భాగస్వామిపై విశ్వాసం ఉంటే రిజిస్టర్ వివాహం చేసుకోవచ్చు. అంతేతప్ప పిరికివారుగా ఆత్మహత్యలకు పాల్పడకూడదు. పెళ్లికి నిరాకరించారని హతమార్చడం వంటివి చర్యలకు పూనుకోకూడదు.

## టీనేజ్ ప్రేమల్లో ఆకర్షణే ఎక్కువ

టీనేజ్‌లో ఉన్నప్పుడు ప్రపంచమే ఓ రంగులమయంగా కనిపిస్తుంది. ఇంటర్ స్థాయి చదివే పిల్లలలో ఇది ఎక్కువగా కనిపిస్తోంది. ఏదో ఆకర్షణకు లోను కావడం, తిరగడం. అన్నీ పోగొట్టుకున్న తరువాత పెద్దలకు ముఖం చూపించలేక ఆత్మహత్యలకు పాల్పడినవాళ్లు కోకొల్లలు.

దీనికి ఏమిటి పరిష్కారం? అని ఆలోచిస్తే ముందు చట్టాలు పటిష్టంగా ఉండాలి. మనదేశంలో న్యాయం జరగాలంటే సంవత్సరాలుగా వేచిచూడాలి. దీంతో నేరం చేసినవారు బెయిల్‌పై బయటికి వచ్చి, సాక్ష్యులను ప్రభావితం చేస్తూ, తమకు అనుకూలంగా మలచుకుని, శిక్షల నుంచి తప్పించుకుంటున్నారు. తద్వారా మరింతగా నేరాలు పెరిగేందుకు ఇదొక కారణంగా ఉంది. తప్పు చేసిన వారు ఏమాత్రం భయం లేకుండా మరింతగా రెచ్చిపోతూ, సమాజానికి, పోలీసులకు సవాలుగా నిలుస్తున్నారు. చట్టం తమ చుట్టంగా మార్చుకుంటున్నారు. కొన్ని శిక్షలు కఠినంగా ఉండడం మాత్రమే కాదు, సత్వరమే విచారణ జరిగి, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగినప్పుడే కొద్దిగానైనా నేరాలు తగ్గుతాయి.

భవిష్యత్‌లో మరెవరూ ఇటువంటి సాహసానికి ఒడిగట్టకుండా చట్టాలు పటిష్టంగా ఉండాలి. కళాశాలల్లో కూడా ముఖ్యంగా కో-ఎడ్యుకేషన్ వున్న





కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించాలి. స్వచ్ఛంద సంస్థలు, పోలీస్ శాఖవారు, అధ్యాపక వర్గం ప్రేమ గురించి, వాటి పర్యవసానం గురించి విడమరచి చెప్పాలి. అందులో వచ్చే కష్టాలు, నష్టాలు మొదలైన వాటిపై అవగాహన కల్పించాలి. నిర్భయ, దిశ చట్టాలు ఉన్నా విచారణలో ఆలస్యం అవుతోంది. తరువాత వీటిని మరచిపోతున్నారు. అప్పుడే, ఆ క్షణమే విచారించాలి. దోషులు ఎవరో స్పష్టంగా తెలిసిపోతున్నా నిర్ణయం తీసుకోవడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఏవో చట్టాలు తెచ్చాం అని ప్రభుత్వం చేతులు దులుపుకుంటోంది.

లోపభూయిష్టంగా ఉన్న చట్టాలను సవరించాలి. చట్టాల్లోని లోపాల వల్ల మృగాళ్ల ఆటలు సాగుతున్నాయి.

ప్రేమ ఆదర్శంగా నిలబడాలే తప్ప హత్యలకు, ఆత్మహత్యలకు దారితీయకూడదు. ప్రేమ గొప్పదే, కాని ఎదుటివారి ప్రాణం తీసేంత గొప్పది కాదు. ఆత్మహత్యకు పాల్పడేంత పిరికిది కాదని గుర్తించాలి. మంచి కుటుంబ సమాజానికి ఎంతో అవసరం. కుటుంబ వ్యవస్థ సరిగ్గా లేకపోతే సమాజంలో అరాచకాలు, నేరాలు, ఘోరాలు పెరిగిపోతాయి. కాబట్టి ప్రతి తల్లిదండ్రులు తమ బిడ్డలపట్ల ఎంతో బాధ్యత కలిగి ఉండాలి. వారిని సరైనమార్గంలో పెంచాలి.

పెరుగుతున్న ఉన్మాద ప్రేమల్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిందే. ఇది ఏ ప్రభుత్వమో, నాయకుల బాధ్యత మాత్రమే కాదు, ప్రతివారి బాధ్యత, కర్తవ్యం కూడా. తెలుగురాష్ట్రాల్లో ఈ ప్రేమపైత్యాలు ఇటీవల కాలంలో బాగా పెరిగిపోతు న్నాయి. ఇదెంతో విచారకరమైన పరిణామం. ప్రేమ హత్యల నివారణకు ప్రభుత్వం కూడా తగిన చర్యలు తీసుకోవాలి. ప్రత్యేకంగా యువతీ యువకులు తొందరపాటు చర్యలకు పూనుకోకుండా జ్ఞానయుక్తంగా నిర్ణయా లు తీసుకోవాలి. ప్రేమ సమాజ హితం, శ్రేయస్సు కావాలే తప్ప సమాజానికి హానికరంగా మారకూడదు. ❑

## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని కార్టూన్లు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా:


ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,

లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

**sunmagvaartha@gmail.com**

# శ్రీవారి పల్లకిలో మాణిక్యం

ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి



చుట్టూ ఉన్న జనాలకు స్పష్టంగా కనిపించే విశాలమైన వేదిక. ఆ వేదికను ఎప్పుడో విజయనగర రాజులు తమ రాజధానికి తగినట్లు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించారు. శిల్పులు నైపుణ్యానికి, పనితనానికి ప్రతీకగా సువిశాల సామ్రాజ్యంలో గుర్తించ బడింది. రంగు రంగుల పూలతో, పచ్చని తోరణాలతో వేదిక ను ఎంతో కళాత్మకంగా అలంకరించారు. బంగారు సింహా సనం మీద విజయనగర సామ్రాజ్యా ధీశుడైన సదాశివరాయలు మధ్యలో ఆసీనుడై ఉండగా ఆయన పక్కనే శ్రీకృష్ణదేవరాయల అల్లుడు మహా ప్రధాని అయిన అళియరామరాయలు ఆసీనుడై ఉన్నాడు. భరతనాట్య వారోత్సవాలను నిర్వహించి పోటీల్లో పాల్గొన్న నాట్యగత్తెల స్థానాలను ప్రకటించడానికి ఆస్థాన నాట్యాచార్యుడు ముందుకొచ్చాడు.

"వేదికనలంకరించిన మన విజయనగర సామ్రాజ్యాధీశులు శ్రీశ్రీశ్రీ సదాశివరాయలు గారికి భరతనాట్యమండలి తరపున నేను శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. అలాగే అరవీర భయంకరులు, మన విజయనగర సామ్రాజ్య మహా ప్రధానిగారైన శ్రీశ్రీశ్రీ అళియరామరాయలు గారికి నా వినయ పూర్వక నమస్కారాలు. వారం రోజుల పాటు అశేష జనవాహిని మధ్య జరిగిన ఈ భరత నాట్యోత్సవాలను ఎంతో శ్రద్ధగా, ఓపికతో వీక్షించిన ఇక్కడున్న విజయనగర రాజధాని ప్రజలందరికీ నా కైమోడ్పులు. మీకు తెలుసు.. ఎన్నో ఏళ్లుగా మన విజయనగరం రాజధానిలో ప్రతి ఏటా భరతనాట్య ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితి. మన సామ్రాజ్యంలోని అన్ని సామంత రాజ్యాల నుండి నిష్ణాతులైన భరతనాట్య కళాకారులు విచ్చేసి ఇక్కడ ప్రదర్శనలు చేసి బహుమతులను రసిక శిఖామణులైన మన ప్రభువుల చేతి గుండా తీసుకొని వెళ్తుంటారు. అందులో భాగంగా ఈ ముగింపు ఉత్సవంలో పాల్గొన్న మన ప్రభువులు, మన మహా ప్రధానివర్యులు విజేతలకు బహుమానాలను అందిస్తారు. న్యాయ నిర్ణేతలైన నాట్యాచార్యులను సత్కరిస్తారు. ఈ వారోత్సవాల్లో అద్భుతమైన ప్రతిభను కనబరిచి భరతనాట్యంలో మేటిగా నిలిచి ప్రథమ స్థానాన్ని అందుకొన్న నాట్యగత్తె తిరువేంకటదాసి వేదిక మీదకు వచ్చి మన ప్రభువులు, మహా ప్రధానివర్యుల చేతుల మీదుగా సత్కారం అందుకోవలసిందిగా కోరుతున్నాను" అని వినయపూర్వకంగా విన్నవించాడు ఆస్థాన నాట్యాచార్యుడు.

అంతసేపు నిశ్శబ్దంగా వింటూ ఉన్న అశేష జనవాహిని నాట్యగత్తె తిరువేంకటదాసికి జేజేలు పలికారు. భరత నాట్య ఆహార్యంలో ఉన్న నాట్యగత్తెల మధ్య నుండి మెరుపు తీగలా తిరువేంకటదాసి వేదిక మీదకొచ్చింది. గంధర్వ కన్య లాంటి తిరువేంకటదాసిని చూసి ప్రజలు ఆకాశం చిల్లుపడేలా కరతాళ ధ్వనులు చేశారు. తిరువేంకటదాసి చేతులు జోడించి తలను వంచి ప్రభువుల వారికి, ప్రధాన మంత్రి వర్యులకు వంగి నమస్కరించి వినయపూర్వకంగా నిలుచుంది. ప్రభువులతో పాటు మహా ప్రధాని ఆమెను ఎంతో ఘనంగా సత్కరించారు. ఆమెతో పాటు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన నాట్యగత్తెలను, అలాగే ఎంతో ప్రతిభ కనబరిచిన వారిని, న్యాయనిర్ణేతలైన నాట్యాచార్యులను కూడా సత్కరిం చారు. ప్రథమ బహుమతిని అందుకొన్న నాట్యగత్తె ప్రభువుల సమక్షంలో నాట్య ప్రదర్శన చేయాలి. తిరువేంకటదాసి ప్రభువుముందు భరతనాట్యాన్ని ప్రదర్శించింది. అందరూ మంత్రముగ్ధులై తిరువేంకటదాసి నాట్యాన్ని చూసి పరవశించిపోయారు. పేరుకు సదాశివరాయలు ప్రభువైనా పెత్తనమంతా అళియరామరాయలదే. అళియరామరాయల పెదనాయన పొట్ల పాటి తిమ్మరాజు కూడా వేదిక మీదనే ఆసీనులై ఉన్నారు. ఆయన గొప్ప కళాపిపాసి. ముఖ్యంగా భరతనాట్యమంటే ఆయనకు ఎంతో ప్రీతి. తిరువేంకటదాసి నాట్యాన్ని చూసి పరవశించిపోయాడు. ఆమె నాట్య విన్యాసానికి మెచ్చి తన మెడలోని బంగారు ఆభరణాన్ని

"అమ్మా తిరువేంకటదాసీ! నీ నాట్య ప్రదర్శన ఎంతో అద్భుతం. రెండో స్థానంలో నిలిచిన అమ్మాయి నీలాగే ఉంది. ఆమె ఎవరు?" అడిగాడు పొట్లపాటి తిమ్మరాజు.

"అయ్యగారూ, ఆమె నా సొంత చెల్లెలు లింగాసాని. ఆమెకు లింగి అనే పేరు కూడా ఉంది. మేమిద్దరం నాట్యమే జీవితంగా బతికిన తిప్పాసాని కూతుళ్లం. మేం హంపీలోనే నివాసముంటున్నాం" చేతులు జోడించి ఎంతో వినయంగా చెప్పింది తరువేంకటదాసి.

"నేను మీ నాట్యాన్ని మరోసారి తినివితీరా చూడాలనుకొంటున్నాను. అయితే వారంలో నేను పరివారంతో కలిసి తిరుపతికి బయలుదేరుతున్నాను. మధ్యలో ఇక్కడ కొన్ని రాచకార్యాలను చక్కబెట్టాలి. తిరుపతికి వెళ్లాక అక్కడ కొంతకాలం పాటు ఉండి తిరుమలేశునికి ఎన్నో సేవలను, ఉత్సవాలను ఏర్పాటు చేయాలి. మీ నాట్యాన్ని చూశాక గత కొంత కాలంగా తిరుమలలో ఆగిపోయిన నృత్య నీరాజనాన్ని తిరిగి ప్రారంభించాల నిపిస్తోంది. మన విజయనగర సామ్రాజ్యానికి ప్రభువులు మారినా, ఎప్పటికీ ప్రభువుగా ఉండే మనందరి దైవం ఆ వెంకన్న. స్వామివారి సేవకు రావాలనిపిస్తే వచ్చే వారం మాతో పాటు రా. ఇందులో బలవంతమేమీ లేదు. బాగా ఆలోచించుకొని నిర్ణయం తీసుకొని చెప్పండి. మొహమాటం వద్దు. బాగా ఆలోచించుకోవడానికి వారం ఉంది" అన్నాడు తిమ్మరాజు.

"దొరగారూ! మీ కోసం తిరువేంకటదాసి వేంచేసి ఉన్నారు. ఆమెతో పాటు మరో ఇద్దరు స్త్రీలు ఉన్నారు. ప్రవేశపెట మంటారా?" అడిగాడు పొట్లపాటి తిమ్మరాజు అంగరక్షకుడు.

"ప్రవేశపెట్టండి" అంటూ అనుమతిచ్చాడు తిమ్మరాజు.

తిరువేంకటదాసి భవనంలోకి ప్రవేశించింది. బయలుదేరడానికి సిద్ధంగా ఉన్న తిమ్మరాజు ముందు నిలబడింది.

"ప్రభువులకు నమస్కారాలు. ఈమె నా చెల్లెలు లింగాసాని, మీరిది వరకే ఈమెను చూశారు. ఈమె మా అమ్మ తిప్పాసాని. మీరు నన్ను తిరుమలేశుని నృత్య నీరాజనానికి రమ్మని ఆహ్వానిం చాక మేం ఈ వారం పాటు బాగా ఆలోచించుకొని ఒక నిర్ణయానికొచ్చాం. మేం మీతో పాటు తిరుపతికి వచ్చి ఆ దేవదేవుడిని ఆరాధించడం కన్నా మాకు వేరే అదృష్టం ఏముంటుంది. మీకు అభ్యంతరం లేకపోతే నాతో పాటు నా చెల్లెలొస్తుంది. ఆమె కూడా భగవంతునికి సేవ నృత్యసేవ చేస్తుంది. ఇక మా అమ్మకు మేమే లోకం, మమ్మల్ని విడిచి ఒక్కతే ఉండలేదు. మీరు అనుమతిస్తే వీళ్లను కూడా నాతో పాటు తీసుకొస్తాను. మాకు ఇంతకన్నా భాగ్యం ఏముంటుంది" అంది వినయపూర్వకంగా తిరువేంకటదాసి.

"ఇదంతా భగవదేచ్ఛ. నేను నిన్ను చూశాక నా చేత ఏడుకొండలవాడే అలా అనిపించాడేమో! ఆయన తన దగ్గరకు మిమ్మల్ని తీసుకొని రావడానికి మీ అందరికీ ఇలా బుద్ధి పుట్టించాడేమో! కానున్నది కాకమానదు, రానున్నది రాక మానదన్నారు పెద్దలు. ఏది ఎలా జరగా లో అలాగే జరుగుతుంది. మనం కేవ లం నిమిత్తమాత్రులం. ప్రయాణానికి సిద్ధమై వచ్చారుగా!" అడిగాడు తిమ్మరాజు.

"చిత్తం ప్రభూ! ఈ రాజధాని నుండి ఆధ్యాత్మిక రాజధానికి రావడానికి సర్వం సిద్ధమై వచ్చాం" అంది ముకుళిత



హస్తాలతో తిరువేంకటదాసి.

"ఎవరక్కడ?" అంటూ పిలుపు గటను కొట్టాడు తిమ్మరాజు.

"చిత్తం ప్రభూ" అంటూ ప్రధాన సేవకుడొచ్చి తల వంచి నిల్చున్నాడు.

"వీళ్లు మనతో పాటే తిరుపతికొస్తున్నారు. వీళ్ల ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు చేయండి. అతనిని అనుసరిస్తూ తిరువేంకటదాసి, ఆమె చెల్లెలు, తల్లి బయటకొచ్చారు. శకునం చూసి అందరూ బయలుదేరారు. తిరుమల శ్రీవారి పాదాల చెంత ఉండే చంద్రగిరి అత్యంత కీలకమైన, అందమైన కోట. అంతః పురంలో తిమ్మరాజు విడిది చేశాడు. కోట ప్రాంగణంలోని ఊరిలో చిన్నపాటి భవనంలో తిరువేంకటదాసి విడిది ఏర్పాటు చేశారు. బంధుమిత్ర పరివారంతో కలిసి అందరూ తిరుమల బయలుదేరారు. అర్చకుల వేదమంత్రాల మధ్య ఆలయంలోకి ప్రవేశించి అందరు శ్రీవారిని దర్శించారు. ముందే అనుకొన్న ప్రకారం బంగారు వాకిలి ముందుండే తిరుమామణి మంటపంలో తిరుమలేశుని కిచ్చి తిరువేంకటదాసిని, లింగాసానిల వివాహం జరిపించే ముందు ఒక తతంగం చేశారు. రామానుజాచార్యుల మేనమామ తిరుమల మొదటి పౌరుడు, తిరుమల గుడి మొదటి ఆచార్య పురుడు తిరుమల నంబి. అతని వారసుడు మొదటి కుమార తాతయ్యంగారు అచ్యుత రాయలకు, సదాశివరాయలకు, పొట్లపాటి తిమ్మరాజుకు రాజగురువు. తిరుమామణి మంటపంలో కుమార తాతయ్యంగారు తిమ్మరాజుకు ఆశీర్వచ నాలు పలికాడు. తదనంతరం తిరువేంకటదాసికి, లింగాసానిలకు శంఖు చక్రాల ముద్రలను కాల్చి వారి భుజాలపై ముద్రలేశాడు. అంటే వీరికి చక్రాంకనం చేసి, వాళ్ల శరీరాలను దేవుని సేవకోసం శుద్ధీకరించాడు. వాళ్లకు మంత్రోపదేశం చేశాడు. మేళ తాళాల మధ్య స్వామికి నాట్యగత్తెలకు వివాహమైపోయింది.

"నేటి నుండి వీరు ఈ ఆలయ దేవదాసీలు. తిరువీధి సానులుగా, నా శిష్యులుగా చలామణి అవుతారు. రాజులు, అధికారులే కాదు ఇలాంటి పవిత్రమైన వారిని కూడా నా శిష్యులుగా చెప్పుకొనేందుకు నేను గర్వపడ్తాను" ఆశీర్వాదపూర్వకంగా అన్నాడు కుమార తాతయ్యంగారు.

"ప్రభూ! వీరు నేటి నుండి శ్రీనివాసుని భార్యలు. వీరి గౌరవ మర్యాదలకు ఏ లోటూ రాకుండా నేను దగ్గరుండి వీరి బాగోగులను చూసుకొంటాను. ఈ దేవుని భార్యలైన వీరు ఎంతో పరమ పవిత్రు లు. స్వామివారి అంగరంగ వైభవంలో వీరిదే ప్రధాన పాత్ర. ఉత్సవ ఊరేగింపుల్లో వీరు స్వామివారి వెంటే ఉంటారు. వీరి సుగుణాలు, అంద చందాలను చూసి దేవదాసీలను దైవ స్వరూపులుగా భావించారు భక్తులు. తిరువేంకటదాసి ఎంతో అంకిత భావంతో నిష్కలంకంగా, నిష్కల్మషంగా భరత నాట్యం చేస్తుంటే చూడడానికి రెండు కళ్లు చాలవు. వేంకటేశ్వరస్వామి, అలిమేలు మంగా ఇద్దరూ కలిసి ఆమెకు 'తిరువేంకట మాణిక్యం' అనే పేరు పెట్టారట. ఇది మాణిక్యానికి శ్రీవారి పల్లకిని బహుమా నంగా ఇచ్చిన శాసనం. ఇంతటి గౌరవం తిరుమల ఆలయ చరిత్రలో ఎవరికీ దక్కలేదు. ఆనాడు అంత మహోజ్వలంగా వెలుగొందారు దేవదాసీలు. ప్రత్యేకించి తిరువేంకట మాణిక్యం దేవుడెక్కి ఊరేగిన పల్లకీలో ఆమె ఎక్కి ఊరేగడం అందరికీ దక్కే అదృష్టం కాదు. నభూతో న భవిష్యతి. ❑

# ఈవారం కవిత్వం



## ఊరంటే ఊపిరి

**చాలా** రోజుల తరువాత
మా ఊరికి వెళ్లానా..!
గాలిదెంత చల్లని మనసో
పొలిమేరలోనే ప్రేమగా పలకరించి స్వాగతించింది.
ఒంటరిగా నడుస్తున్న నన్ను చూసి
ఇంటివద్ద జాగ్రత్తగా దిగబెట్టేందుకు
రోడ్డు నాతో కలిసి నడిచింది.
ఇరువైపుల ఇళ్లన్నీ
నన్ను చూడడం కోసం
కిటికీల కళ్లు తెరిచి నిల్చున్నాయి.
ఆనందంతో మొక్కల మొహాల మీద
చిరునవ్వుల పువ్వులు.
గట్టు చివరి వరకూ అలలు అలలుగా వచ్చి
వెనుదిరిగిపోతుంది చెరువు
తనతో మాట్లాడలేదని కోపం కాబోలు.
నిజానికి అదంతా ఉత్తుత్తి కోపం..
దగ్గరకు వెళ్లగానే నా ప్రతిబింబాన్ని తన గుండెల్లో
దాచుకుంది.
రైతన్నతో కీలకమైన సంభాషణలో ఉన్న వరిచేలు
నా వద్దకు వచ్చే ఆస్కారం లేక
'బాగున్నావా' అనే అర్థం స్ఫురించేలా
తలలూపాయి.
నా రాకను గమనించిన పాఠశాల
నాతో ముచ్చడించడం కోసం
గంట కొట్టి తరగతులకు విరామం ఇచ్చింది.
కొంతసేపు తమ తోటలో
సేద తీరి వెళ్లమని సీతాకోక చిలుకలు ఆహ్వానించాయి.
తిరిగి వెళ్లేలోపు తప్పక వస్తానని మాటిచ్చాను.
ఇపుడెందుకో../ తుది వాక్యంగా
'ఊరంటే ఇష్టం' అనేది ఇక్కడ సరిపడదనిపిస్తుంది.
అందుకే 'ఊరంటే ఊపిరి' అని
ఇలా రాసుకుంటున్నాను ప్రేమతో.

**- దొరబాబు మొఖమాట్ల**

## తెల్లని మెలుకువ కప్పుకుని..

**మనిషి** మనిషిలో నల్లని స్పర్శకు
తప్పుకు తిరుగుతూ
ముఖం చిట్లి
చూపు పీలికలు కాకుండా
నాలుకపై ఎగుడు దిగుడు శబ్దంతో
అర్థం ముక్కలు కాకుండా
అసూయ తాపానికి
పగ రాజుకోకుండా
కలను కూర్చే
కోరికల అడుగు మెలిక పడకుండా
తెల్లని మెలుకువ కప్పుకుని
తనకు తాను గుచ్చుకోకుండా
మెత్తని మచ్చికతో
మనసు మెల్లగా నడవాలి.

**- చందలూరి నారాయణరావు**

## నీ భావధ్వని

**నీ** చూపులు
మెరిసే మెరుపులలా మారి
నా మదిని
పూల వర్షంతో తడిపేస్తున్నాయి
నీ పలుకులు
మంచి ముత్యపు శబ్దాలలా
మారి
నా ఎదను
తీపి రసగుళికలలా
ఊరిస్తున్నాయి
నీ మేని సొబగులు
మబ్బుల పల్లకిలా మారి
నా గుండెను
వేణువై రాగాలాపనలో ఊపేస్తున్నాయి
నీ పరువాలు
నిండు రేయిన ఇంద్రధనస్సులా మారి
నా హృదిని
సౌగంధ శరమై శ్వాసాప్రేమను
ఛేదిస్తున్నాయి
అందుకే చెబుతున్నా
నీ భావధ్వని
నను లాలిస్తున్న
అమర ప్రేమ సన్నిధని.

**- డా॥ బాలాజీ దీక్షితులు పి.వి.**



## 'పృథ్వీ గోదావరి నానీలు'



గోదావరి నదికే ఈ నానీల సంపుటి కవి అంకితం చేసారు. మూడు దశాబ్దాల క్రిందట ఈ 'వార్త' పత్రికల్లో గోపి ఆలోచనా స్రవంతి నుండి 'నానీ'ల ప్రక్రియ ఆవిర్భవించింది. ఎందరో కవులు వందల్లో 'నానీ' సంపుటాలు వేసారు. వేలల్లో నానీలు రాసారు. ఫెలోషిప్‌లో పి.హెచ్.డిలు పొందారు. వచన కవిత్వంలో ఇదో రూపమైన విశిష్ట ప్రక్రియగా ఆవిర్భవించింది. ఈ కవి గతంలో 4 నానీల సంపుటాలు వేసారు. కవి రాసిన శ్రీశ్రీనానీలు ఆంగ్లంలోకి అనువాదాలు అయ్యాయి. నానీల సృష్టికర్త డా॥ఎన్.గోపి 'గోదారి దారిలో' అంటూ చక్కటి విలువైన ముందు మాట రాసారు. ఈ నానీల్లో గోదావరీ తీర చారిత్రక సాంస్కృతిక, సామాజిక వ్యక్తుల్ని 4 పాదాల నానీల్లో రాసారు కవి. 1997లో ప్రారంభమైన నానీ కవితా ప్రక్రియలో 460 నానీల సంపుటాలు రావడం గొప్ప విషయం. మచ్చుకు మూడు నాలుగు నానీలు చూద్దాం. రాజరాజుకి/ నన్నయ కనుక/ తెలుగుభాషకి/ భారతం దీపిక (పేజి.1) అంటారు. రాజమండ్రి/ వారసులెందరో/ 'అమ్మ' నవలకి తెలుగు/ 'కొవ్విడి' వెలుగు (పేజి.16). కవి పండితపీఠం/ ఆంధ్రికుటీరం/ ఆంధ్ర పురాణం/ మధునాపంతులగానం' (పేజి.26) అంటారు కవి. ఇలా రాజమండ్రి ప్రాంత విశిష్టతను వ్యక్తులను నానీల్లో పలికించిన పృథ్వి అభినందనీయులు. **(గోదావరి నానీలు, రచన: ఎస్.ఆర్.పృథ్వి, వెల: 60, ప్రతులకు: పి.ఉషారాణి, 104-6-140, ఎం.జి.వీధి,రాజమహేంద్రవరం)**

– తంగిరాల చక్రవర్తి

## రాయలసీమ జీవన చిత్రాలు రేగడి సీమ కథలు




రాయలసీమ జీవనచిత్రాలుగా నిలిచిన కథలు ఎన్నో ఇది వరకు వచ్చాయి. వాటిస్థాయిలో నిలిచే గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి రాసిన రేగడి సీమ కథలు. ఎల్ఐసిలో రిటైర్డ్ అయ్యాక సాహిత్యవ్యాసంగం చేపట్టి కవితలు, కథలు రాసి 'యోధుడు కొండారెడ్డి' అనే చారిత్రక నవలను రచించి ప్రశంసలు పొందారు. పూర్తి రాయలసీమ మాండలికంలో రాసిన రేగటి సీమ కథలు రాయలసీమ పల్లె బ్రతుకుల అగచాట్లు, ఆచారాలు, కట్టుబాట్లు సహజత్వంగా రాశారు. కరోనా సమయంలో లాక్‌డౌన్ మాదిరి పూర్వకాలం నుండి ఒక ఊరి నుండి ఇంకొక ఊరికి అంటు వ్యాధులు కట్టుబాటు 'పొత్తి' కథలో చిత్రించారు. రాయలసీమ అనగానే కక్షలు, వర్గపోరు కాదు అని మానవత్వపు విలువలు తెలిపే కథలు, స్నేహమేరా ఎటర్నల్, దేవరకథలు, ఆరుతడి, సీమసూర్యుడు, గేటుగాడు, రాయలసీమ రైతు కష్టాలు, పొలం తగాదాలు, కాలం కట్టుబాట్లు చిత్రించాయి. ఈ కథలలో చాలామటుకు రచయిత జీవితానుభవాల నుండి ప్రేరణ పొందినవే. రచయిత తన చుట్టు ఉండే మనుషులనే పాత్రలుగా చేసుకుని మలచిన కథలు ఇవి. **(రేగడి సీమ కథలు, రచన: గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, వెల: రూ 150, ప్రతులకు: గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, ఇ.నం.86-267, సోమప్పకాలని, బి.క్యాంప్, కర్నూలు జిల్లా)**

– కూచిమంచి నాగమణి

# పుస్తక సమీక్ష

## హాస్య, వ్యంగ్య కథలు

హాస్యం మానవునికి ప్రసాదించబడిన ఒక అపురూప వరం. జీవజాలమంతటికీ, ఒక్క మానవుడే నవ్వగలడు. ఎంతటి బాధనైనా హాస్యం మరిపించి మనోల్లాసాన్ని కలిగిస్తుంది. కొన్నికొన్ని సందర్భాల్లో చికిత్స కూడా 'నవ్వు'తో మొదలెడతారట! నాటికాలం రచయితల్లో, పానుగంటి, చిలకమర్తి, మొక్కపాటి వంటి హాస్యరచయితలు ఇంకా 'ఎవర్‌గ్రీన్' నిన్నమొన్నటి దాకా



ముళ్లపూడి వెంకటరమణ మనల్ని నవ్వించి నిష్క్రమించినా, మరో నాలుగు తరాలదాకా గుర్తు ఉండిపోతారు. హాస్యానికి వ్యంగ్యానికి తేడా తెలుపుతూ 'ఈ సన్మానం మీకే' గ్రంథరచయిత పోట్లూరు సుబ్రహ్మణ్యం అందిస్తోన్న అపురూపకానుకలో 24 హాస్య కథలున్నాయి. ఇది చదువుతుంటే మనకు తెలియకుండానే మనపెదాలు అలవోకగా విచ్చుకుని మనసుల్ని తేలికపరుస్తాయి. సుబ్రహ్మణ్యం మరో కొత్త ప్రయోగం వీరు ఇచ్చిన నాలుగు పేజీల 'కథలు వాటి కమామిషు' పుస్తకం తెరవగానే ఏకథ ఏమిటో చెబుతుంది. అన్నీ వరసగా చదవనక్కర లేకుండా ఈ కమామిషు చదివి నచ్చిన కథ మొదట చదువొచ్చు. ఆ తర్వాత మరో కథ..మరోకథ ఇట్లా మనకు తెలీకుండానే 24 కథల్ని చదివేసి 'అప్పుడే అయిపోయిందా' అని ఆశ్చర్యపోతాము. ఇతర భాషల్లోకి కూడా వీరి కథలు అనువదింపబడటం వీరి ప్రతిభకు తార్కాణం. మరెందుకు ఆలస్యం! ఇప్పుడే మనల్ని సన్మానిస్తోన్న పోట్లూరి వారి కథల్లోకి వెళ్లిపోదాం. **(సన్మానంమీకే, రచన: పోట్లూరుసుబ్రహ్మణ్యం, వెల: రూ 250, ప్రతులకు: విశాఖ రచయితల సంఘం, విశాఖ)** –కూర చిదంబరం

## పద్యప్రియులకే అపురూప కానుక 'మౌక్తికం'

'పద్యకళాప్రవీణ' ఆచార్య ఫణీంద్ర 250కిపైగా ముక్తక పద్యాలతో వెలువరించిన సంపుటి 'మౌక్తికం'. మౌక్తికం అంటే ముత్యం. ముత్యాల్లాంటి పద్యాల సమాహారం. కొన్ని ఆశువులు, సమస్యా పూరణలు, ప్యారడీలు, అనుభవాలు, స్మృతులు, అను



భూతులు కలగలిపి రసరమ్యతగా తీర్చిదిద్దిన పద్యరత్నాలు యివి. మానసికోల్లాసాన్ని కలిగించినవి కొన్నవుతే, వ్యక్తిత్వ నిర్మాణాన్ని ప్రోది చేసినవి మరికొన్ని. అక్షరాల అమరికతో మహాశివుణ్ని అభిషేకించిన తీరు గమనించండి. 'నెలవంక రూపమే' తలకట్టు/ శూలమే 'దీర్ఘము'/ నాగేంద్రుడే 'గుడి దీర్ఘము'/ నంది కొమ్ములు 'కొమ్ము'రాయె/ ఏత్వంబు, లోత్సంబురే', నాగభూషణాలు/ 'ఋత్వాలు' జంగమ ఋషులు/ 'పూర్ణ బిందువె' అన్నపూర్ణముఖంబు/ ప్రమధగణపతి 'ప్రణవం'/ అక్షరములే తెలుగువాని కక్షతలగు/ అలక 'అక్షరముగ'త్రిలింగా వనిపయి' ఫణీంద్ర ఊహాశీలిత, పద్య పటిమను సుస్పష్టం చేసిన పద్యం యిది. 'ఒక శిలగుడిలో ప్రతిమగు/ ఒక శిల ఆ గుడికి ముందు నొదుగున్ మెట్టై/ ఒక దానిని మ్రొక్కుతాం, మరొక దానిని త్రొక్కుతాం!! హృద్యమైన వ్యక్తీకరణం. కాళోజి, ఘంటశాల, దివాకర్ల, వేటూరు, సినారె వంటి పభృతుల స్మృతిలో అల్లిన పద్యాలు వారిపట్ల కవి భక్తిభావానికి దర్పణం పడ్తాయి. పద్యప్రియులకు 'మౌక్తికం' ఒక అపురూప కానుక. **(మౌక్తికం, రచన: డా॥ఆచార్య ఫణీంద్ర, వెల: రూ 150, ప్రతులకు: అన్ని ప్రముఖ బుక్‌హౌస్)**

– రమణ వెలమకన్ని

# చితికిన పసిజీవితాల్లో వెలుగు



**2007లో** జరిగిందీ సంఘటన. మధ్యప్రదేశ్‌లోని నర్సింగ్‌గఢ్ ఠాణా పోలీసు ఇన్‌స్పెక్టర్ రవీంద్ర మిశ్ర తమకి దగ్గర్లోని ఓ ఆదివాసి గూడేనికి వెళ్లాడు. అక్కడ ఆదివాసీ మహిళలు విటుల్ని పిలిచే పిలుపు, ఓ పద్నాలుగేళ్ల అమ్మాయి అలాగే పిలవడం వీరేంద్రని నిలువెల్లా వణికిపోయేలా చేసింది. 'ఇంత చిన్నపిల్లనీ ఈ నరకంలోకి దించారేమిటి?' అని అడిగితే 'చేయించక పోతే మా ఆకలి ఎలా తీరుతుంది?' అని ఎదురు ప్రశ్నించిందా తల్లి. ఆ మాటలకి తానొక పోలీసు ఆఫీసర్నన్న విషయం కూడా మరచిపోయి కన్నీళ్లు పెట్టుకున్నాడాయన. ఆ చిన్నారికి తన కూతురు వయస్సుంటుందేమో! అంతే ఓ ఉద్వేగంతో 'ఈ పాపని నేను దత్తత తీసుకుంటాను. ఇవ్వండి' అన్నాడు. అది విని గూడెం పెద్దవాళ్లు వచ్చి గొడవపెట్టుకుని అతణ్ణి పంపించేశారు. ఇంటికొచ్చినా ముక్కుపచ్చలారని ఆ పాపే అతని కళ్లలో మెదలసాగింది. 'మీరు మరీ సున్నితం సార్! బేడియా ఆదివాసీల్లో అరవై ఏళ్లుగా సాగుతున్న వృత్తి ఇది. మేమెన్నోసార్లు వాళ్లని అరెస్టు చేశాం.. అయినా లాభం లేదు. మీరూ వదిలెయ్యండి' అన్నారట సహచర పోలీసులు. అందులో నిజం లేకపోలేదు..


### మూడు తరాల ఘోరం

బేడియా..చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలో కనిపించే ఓ గిరిజన తెగ. ఒకప్పుడు నాట్యకళాకారులుగా గొప్ప పేరు గడించినవారు వీళ్లు కానీ బ్రిటిష్ వాళ్లకాలంలో సిపాయి తిరుగుబాటప్పుడు విప్లకారులకి సాయం చేశారట. దాంతో బ్రిటిష్ ప్రభుత్వం ఈ తెగని 'నేరస్థ జాతి'గా (నోటిఫైడ్ ట్రైబ్) ప్రకటించింది. వీరి భూముల్ని లాక్కుని అడవుల్లోకి తరిమేసింది. అప్పటికీ మధ్యప్రదేశ్‌లోని సంస్థానాధీశులు కొందరు వీళ్లని చేరదీశారు కానీ స్వాతంత్ర్యం వచ్చి రాచరికాలు రద్దయ్యాక ఆ ఆదరణాకరవైంది. వేరేదారి తెలియక తమ అందాన్నే పెట్టుబడిగా పెట్టి ఆడవాళ్లు వ్యభిచారంలోకి దిగారు. మరే వృత్తీ చేయలేని మగవాళ్లు వాళ్లకి సాయం చేయడం మొదలుఎట్టారు. ఆడవాళ్లకి పెళ్లిళ్లవుతాయికానీ అది పేరుకే. పుట్టే పిల్లలకి భర్త బాధ్యత తీసుకోడు. తండ్రెవరో తెలియని ఈ ఆడపిల్లల్ని బడిలో చేర్చినా ఉపాధ్యాయులు వాళ్లపక్కన మిగతా విద్యార్థుల్ని కూర్చోబెట్టరు. కనీసం వీళ్లని మంచినీళ్లయినా ముట్టుకోనివ్వరు. ఈ వివక్షని తట్టుకోలేని పిల్లలు ఇంటికే పరిమితమవుతారు. పడుపువృత్తిలోకే దిగుతారు. మధ్యప్రదేశ్ రాయ్‌గఢ్ జిల్లాలోని నరిసంగ్‌గఢ్ పట్టణం చుట్టుపక్కలున్న బేడియా తెగ ప్రజల ఈ దుస్థితిని మార్చాలనుకున్నాడు రవీంద్ర మిశ్ర. కానీ అందరు పోలీసుల్లా క్రిమినల్ చట్టంతో కాకుండా సామాజిక స్పృహతో ఆ పని చేయాలనుకున్నాడు. గూడేలకి వెళ్లి చదువు విలువని చెప్పసాగాడు. ఆ మాటల్ని పెద్దలు పట్టించుకోకున్నా పిల్లలు విన్నారు.

### ఓ పాపతో మొదలు

ఓ రోజు బేడియా గూడెం నుంచి పదమూడేళ్లున్న ఒక పాప రవీంద్రని వెతుక్కుంటూ వచ్చింది. 'మీరు నాలాంటివాళ్లని చదివిస్తానంటున్నారు కదా! నేను మీతో వస్తాను' అంది. 'నువ్వొక్కదానివేనా..ఇంకెవ్వరూ రారా!' అన్నాడాయన. ఆమె తన స్నేహితురాళ్లని చూసింది. అలా 13మందిని ఎంపికచేసి అతికష్టంపైన వాళ్ల పెద్దల్ని ఒప్పించి మధ్యప్రదేశ్ రాజధాని భూపాల్‌లోని బడుల్లో చేర్పించాడు మిశ్ర. తాను స్థాపించిన 'సంవేదన' అన్న ఎన్జీఓ ద్వారా వాళ్ల ఆలనాపాలనా చూడసాగాడు. వాళ్లనే ఉదాహరణగా చూపించి ఇతర జిల్లాల్లోని ఈ తెగ ప్రజల్లో కదలిక తెచ్చాడు. మధ్యప్రదేశ్‌లోని బడులన్నింటా చైతన్య కార్యక్రమాలు నిర్వహించి ఆ పిల్లలపైన వివక్షని రూపుమాపాడు.

ఆ ప్రయత్నాలు అద్భుతాలే చేశాయి. ఆయన బడుల్లో చేర్చిన పిల్లల్లో దాదాపు వందమంది పట్టభద్రులయ్యారు. తన వృత్తికి అతీతంగా రవీంద్ర మిశ్ర చేసిన కృషిని ఐక్యరాజ్యసమితీ గుర్తించింది. ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లోని ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (ఐఎస్ఎఫ్) విభాగంలో ఏఐజీగా ఉంటున్న రవీంద్రమిశ్ర.. తన సంవేదన ఎన్జీఓ ద్వారా ఆరువేల మందిని చదివిస్తున్నాడు. ❑






మారుతున్న ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా, ఆదాయాన్ని సంపాదించడానికి కొత్తకొత్త వ్యాపారాలు ప్రారంభించడం అక్కడా ఇక్కడా వింటూ ఉంటాం. అయితే ఈ వరుసలో పిల్లలకు పేర్లు పెట్టడం ద్వారా బోలెడంత సంపాదించవచ్చని తెలుసుకుంది ఓ మహిళ. ఆమె పేరు హాంప్రీ. న్యూయార్క్‌కు చెందిన మహిళ. పిల్లలకు పేరు పెట్టడానికి ఆమె అక్షరాలా పదిహేను వందల డాలర్లు! నవజాత శిశువుకు పేరు పెట్టడం అంత తేలికైన పని కాదు. జ్యోతిష్యంపై నమ్మకం ఉన్న వ్యక్తులు

# పేరు తెచ్చిన సంపద

తమ బిడ్డలకు పేరు పెట్టాల్సి వచ్చినప్పుడు వర్ణమాలలో ఏ అక్షరంతో పేరు మొదలుపెట్టాలా అని ఆలోచిస్తారు. కొందరు తామనుకున్న పేరు పెట్టగలరు. ఎక్కడైనా పిల్లలకు పేర్లు అంటూ వెలువడిన పుస్తకాలలో లేక ఇంటర్నెట్‌లోనో అన్వేషిస్తారు. మరికొందరు ఎవరో ఒకర్ని పేరు పెట్టమని సంప్రదిస్తారు. అప్పుడే పుట్టిన బిడ్డను చూసేందుకు వచ్చిన వారిని ఏదైనా మంచి పేరు ఉంటే చెప్పమని, ఆ పేరు బహు అరుదుగా ఉండాలని, ఆధునికంగా ఉండాలని అడుగుతుండటం చూడొచ్చు. కొంతమంది తల్లిదండ్రులైతే బిడ్డ కడుపులో ఉండగానే పేర్లు పెట్టే విషయంలో చర్చించుకుంటూ ఉంటారు. తామనుకున్న పేరు ఆధునికంగా ఉందనుకుంటే ఆ పేరు పెట్టేస్తారు. ఇలా బిడ్డకు పేరు పెట్టడం అనేది ఓ తంతు. ఇంత చెప్తున్న నేను మా అబ్బాయికి పేరు పెట్టవలసి వచ్చినప్పుడు మా నాన్నగారికి ఉత్తరం రాసి మరీ అడిగాను. మీరు పెట్టే ఆధునికంగా ఉండాలని, అరుదైనదిగా ఉండాలని ఏవేవో కోరికలు వెల్లడించాను. అందుకు ఆయన సాత్యకి అనే పేరు పెట్టమని, నీకిష్టమైతే ఈ పేరు పెట్టు, కాదంటావా ఏ రాయో రప్పో అని పేరు పెట్టుకో నీ ఇష్టం అని ప్రత్యుత్తరంరాశారు. అయితే మాకు సాత్యకి అనే పేరు నచ్చి అదే పెట్టాం.

ఇక నేను పుట్టినప్పుడు నాకు మా నాన్నగారు రచయిత చలంగారి కుమార్తె పౌగారితో పేరు (జగదీశ్) పెట్టించారు. పేరు అనేది ఒకరికి గుర్తింపు. పిల్లవాడు పెరిగి యుక్త వయస్కుడై ముసలి వాడవ వచ్చు. ఎదిగేకొద్దీ రూపురేఖలు మారడం సహజం. కానీ మన పేరు జీవితాంతం మనతోనే ఉంటుంది. అయితే పిల్లలకు పేరు పెట్టడం అనేది కూడా ఓ వృత్తిగా చేసుకున్న ఆమె ఊహాకందని రీతిలో డబ్బులు గడించడం అనేది ఆశ్చర్యమే అనిపించింది. అమెరికాకు చెందిన ఆమె పేరు టేలర్ ఎ.హాంప్రీ. ఆమె వయస్సు 35 ఏళ్లు. 2020లోనే 100 మందికి పైగా పిల్లలకు పేర్లు పెట్టేక్రమంలో ఆమె ఏకంగా లక్షన్నర డాలర్లు సంపాదించింది. అంటే మన భారత కరెన్సీలో రూ.1,14,44,655 (ఒక కోటి పద్నాలుగు లక్షల నలభై నాలుగు వేల ఆరు వందల యాభై ఐదు రూపాయలు). పేరు పెట్టడం ద్వారా కూడా డబ్బులు సమకూర్చుకోవచ్చన్న ఆమె పేరుసైతం అక్కడి 'బడా వ్యాపారవేత్తల పట్టికలో నమోదవడం అనేది ఓ విశేషమే.

యామిజాల జగదీశ్


టేలర్ ఎ.హాంప్రీ

కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి, స్వచ్ఛమైన, పవిత్రమైన పేర్లను పెట్టడానికి ఇష్టపడతారని, వారు కోరుకున్న విధంగా పేరు పెట్టడం అన్నది అంత సులువైన పని కాదని, వాటిని వెతకడానికి తగినంత సమయం కూడా ఇవ్వని పెద్దలున్నారని ఆమె అన్నారు. అయితే అటువంటి వారికోసం కోరికలకు తగినట్టు హాంప్రీ పేరు వెతికి సూచించినప్పుడు 'అందుకేనండీ మీ దగ్గరకు వచ్చాం. ఎంత బాగుందో పేరు' అని ఆమెకు ధన్యవాదాలు చెప్పి డబ్బులు ఇచ్చే తల్లిదండ్రులున్నారు. అందువల్లే న్యూయార్క్‌కు చెందిన ఈమెను 'ప్రొఫెషనల్ బేబీ నేమర్'గా అందరూ అభివర్ణిస్తుంటారు. పిల్లలకు ఏ పేరు పెట్టాలో తెలియక తికమతపడే తల్లిదండ్రులకు ఆమె సేవ ఎంతగానో ఉపకరిస్తోంది. ఆమె ఒక బిడ్డకు పేరు పెట్టడానికి 1,500 డాలర్ల వరకు వసూలు చేస్తారు. పేరు పెట్టే వ్యాపారాన్ని ఆమె 2015లో ప్రారంభించారు. 'వాట్స్ ఇన్ ఏ బేబీ నేమ్' అనే వెబ్‌సైట్‌ను కూడా ఆమె నడుపుతున్నారు.

(మిగతా 19వ పేజీలో)





కథ

# వ్యాపారి లౌక్యం



ఎప్పటిలా ఉదయం ఐదుగంటలకు తన టీ దుకాణం ఆరంభించాడు బుజ్జిబాబు. అతని అంగడి ఎదురుగా రోడ్డుకు ఇరువైపులా కూరగాయలు అమ్మేవాళ్లు తాత్కాలికంగా దుకాణాలు ఏర్పాటు చేసుకుని అమ్ముకుని సాయంత్రం పొద్దుపోగానే వెళ్లిపోతుంటారు. సరిగ్గా తన అంగడి ముందు ములక్కాయలు బుట్టనిండుగా పెట్టుకుని 'రెండు కాయలు పది రూపాయలు' అని అమ్మసాగాడు ఒక వృద్ధుడు. అక్కడ ఉన్న వ్యాపారులు అందరికి ఉదయం పదిగంటలకు, సాయంత్రం నాలుగుగంటలకు బుజ్జిబాబు టీ తన అంగడిలో పనివారితో పంపిస్తుంటాడు.

మధ్యాహన్న సమయంలో ములక్కాయలు అమ్మే ఆ వృద్ధుడు 'పదిరూపాయలకు మూడుకాయలు అని అరవసాగాడు'. అది విన్న బుజ్జిబాబు నవ్వుకున్నాడు. సాయంత్రం కాగానే 'పదిరూపాయలకు నాలుగుకాయలు' అని అమ్మసాగాడు. కొద్దిసేపటికి ములక్కాయలు అన్ని అమ్ముడుపోగా నాలుగు కాయలు మిగిలాయి. ఆ కాయలు బుజ్జిబాబుకు ఇచ్చాడు ఆ వృద్ధుడు.

'తాతా ఈ నాలుగుకాయలకు ఎంత ఇవ్వ మంటావు?' అన్నాడు బుజ్జిబాబు. బోసినోటితో నవ్విన తాత 'ఏంవద్దులే' అన్నాడు.

'తాతా ఉదయం ఒక వెల, మధ్యాహ్నం ఒకవెల, సాయంత్రం ఒక వెల ఎందుకు అలా అమ్మావు' అన్నాడు.

'నాయనా రెండువందలు పెట్టి ఈ ములక్కాయలు తెచ్చాను. ఉదయం అమ్మకంలో నా రెండువందలు వచ్చాయి. ఇకపైన వచ్చేదంతా నా లాభమే. అందుకే మధ్యాహ్నం మూడుకాయల వంతున అమ్మాను, సాయంత్రం కూలి పనిచేసుకునేవారు, పేదవారు తక్కువ ధరకు కూరగాయలు వస్తాయని కొనుగోలుకు వస్తారు. పేదలకు చిరు సహాయం చేయాలనే తలంపుతో ప్రతిరోజు సాయంత్రం వేళలో తక్కువ ధరకు అమ్ముతుంటాను. మనకు ఉన్నంతలో సాటివారికి సహాయపడటం మానవత్వం కదా!' అని బుట్టనెత్తిన పెట్టుకుని వెళ్లిపోయాడు. అలా వెళుతున్న తాతను చూస్తూ అతని దానగుణానికి రెండు చేతులు ఎత్తి నమస్కరించాడు బుజ్జిబాబు.

**- డా॥ బెల్లంకొండ నాగేశ్వరరావు**



రంగులు వేయండి





## బాలగేయం

### చంద్రయాన్



చందమామ చూడవే
చంద్రాయన్‌ను పిలువవే
జైభారత్ చెప్పవే
జేజేలు పాడవే
చిందులేస్తూ ఎగురవే
చంద్రాయన్తో ఆడుకోవే
ఫొటోలు తీయమనవే
ఇస్రోకు
పంపమని చెప్పవే
మాకు తెలియని
కథలు చెప్పవే
మా అబ్బాయికి
చెప్పమని చెప్పవే
వాళ్లు అవుతారు
గొప్ప శాస్త్రవేత్తలు
దేశానికి చేస్తారు
సేవలెన్నో..

- ఓట్ర ప్రకాశ్

## హాలో ఫ్రెండ్...


**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- బి.భావన,** ప్రొద్దుటూరు

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. కంప్యూటర్‌ను చూస్తే కంటిచూపు దెబ్బతింటుందా?**



**జవాబు: భావన!** కంప్యూటర్‌ను ఉపయోగించడం వల్ల కంటిచూపుకు ఏ విధంగానూ హాని ఏర్పడదు. ఏకబిగిన గంటల తరబడి స్క్రీన్ మీద తదేకంగా చూస్తూ పని చేయడం వల్ల మాత్రం కళ్లు బాగా అలసిపోవడం, కంటినొప్పి, తద్వారా తలనొప్పి వంటివి రావడం జరిగే అవకాశం ఉంది. స్క్రీన్ వైపుగా ట్యూబ్‌లైట్ ఏర్పరచి లైటింగ్‌ను సర్దుబాటు చేయడం ద్వారా కంప్యూటర్‌తో పని చేయవచ్చు. టీవీని కనీసం పది అడుగుల దూరం నుంచి చూడాలి. కనీసం గుడ్డి వెలుతురు లోనైనా చూడాలి. కంటిచూపు మందగించకుండా 'ఐ ఎక్సర్‌సైజ్' చేయడం అన్ని విధాలా మంచిది.

**- ఎస్.సూర్యప్రకాశ్,** నారాయణపేట

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. లాయర్ కోటు, గొడుగులు (ఎక్కువగా) నల్లటి వస్త్రంతోనే తయారు చేస్తారు..ఎందువల్ల?**



**జవాబు: సూర్యప్రకాశ్!** లేత రంగుల కన్నా నలుపు రంగు లేదా ఇతర ముదురు రంగులు పరిసరాల నుంచి ఎక్కువ ఉష్ణోగ్రతను గ్రహిస్తాయి. దాంతో బాష్పీభవన ప్రక్రియ వేగంగా జరిగి, త్వరగా ఆరిపోతాయి. నల్లటి బట్టల అణు నిర్మాణంలో అన్ని రంగుల కాంతులను గ్రహించి ఉత్తేజితం అయ్యే స్వభావం ఉంటుంది. నల్లటి వస్త్రాల మీద పడిన కాంతి మొత్తం శోషణం చెందుతుంది. తీవ్ర స్థాయిలో ఉన్న ఉష్ణాన్ని ఈ నలుపు రంగు మింగేస్తుందని చెప్పుకోవచ్చు. మరో రకంగా పడిన ఎండవేడిమిని చెల్లాచెదరు చేసేస్తుందని చెప్పవచ్చు.



# ఆస్ట్రోనాట్ల జీవన విధానం

**చంద్రయాన్-3** విజయం ఒక్క భారత్‌లోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా అంతరిక్ష పరిశోధనలు మరింత వేగం పుంజుకునేలా చేసింది. శాస్త్రవేత్తలే కాదు, సామాన్యులు సైతం చుక్కలలోకంలో విహరించే రోజు మరెంతో దూరంలో లేదు అన్న ఆశను మరోసారి రేకెత్తించింది. విశ్వాంతరాళంలో భూమికన్నా వందలరెట్లు పెద్దవైన గ్రహాలెన్నో ఉన్నాయి. వాటిల్లో మానవాళికి ఉపయోగపడే బంగారం, ప్లాటినం వంటి విలువైన లోహాల నుంచి సాంకేతిక విజ్ఞానానికి దోహదపడే యూరోపియం, టాంటాలమ్ వంటి అరుదైన లోహాల వరకూ ఎన్నెన్నో దాగున్నాయి. వాటిని తవ్వి తెచ్చేందుకు, నేల పట్టనంతగా రోజురోజుకీ పెరుగుతున్న మానవాళికి ఇతర గ్రహాల్లో చోటు కల్పించేందుకూ పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. కానీ అంతరిక్ష నౌకల్లో ఉన్నవారు మనలా తినలేరు..తాగలేరు, పీల్చడానికి గాలీ ఉండదు. మొత్తమ్మీద గురుత్వాకర్షణశక్తి లేని అంతరిక్షంలో తేలుతూ జీవించడం దుస్సాహసం అనే చెప్పాలి. అందుకే పరిశోధనల కోసం వెళ్లే ఆస్ట్రోనాట్ల జీవన సౌలభ్యం, ఆరోగ్యం కోసం కూడా నిరంతర పరిశోధనలు జరుగుతుంటాయి. అలా వాళ్లకోసం రూపొందించినవే ఇవన్నీనూ..

## అంతరిక్ష నౌకల్లో ఆహారం

నిల్వచేయడానికి స్థలం సరిపోదు. అందుకే మొదట్లో ఆకలి పుట్టించని పౌడర్లూ సెమీలిక్విడ్లూ తినేవారు. కానీ వాటిని తినడం కష్టంగా ఉండటంతో నీటిలో కలిపితే మళ్లీ యథాస్థితికి వచ్చే ఆహారంకోసం శోధించారు నాసా నిపుణులు. రోదసీలోకి తీసుకెళ్లే పదార్థాల బరువును 20శాతానికి కుదించాలి. పోషకాలు మాత్రం కాస్త కూడా తగ్గకూడదు. అలా వచ్చిందే నేడు మనం వాడుతున్న ఫ్రీజ్‌డ్రైయింగ్ విధానం. అంటే ఆయా పదార్థాల్ని ముందు శీతలీకరిస్తారు. ఆపై వ్యాక్యూమ్ చాంబర్ల ద్వారా అందులోని నీరంతా ఆవిరైపోయేలా చేసి వాటి బరువుని బాగా తగ్గిస్తారు. ఉదాహరణకు 50గ్రా. బరువున్న స్ట్రాబెర్రీని 10.గ్రాలకే కుదిస్తారన్నమాట. ఈ పద్ధతిలో పండ్లూ నూడుల్స్ వంటి వాటితోపాటు ఐస్‌క్రీమ్‌ని కూడా తయారుచేశారు. ఐస్‌క్రీమ్ శాండ్‌విచ్ కూడా ఈ విధానం నుంచి పుట్టుకొచ్చిందే. ప్రస్తుతం అక్కడి శాస్త్రవేత్తలకు ఓవెనూ ఫ్రిజ్జూ ఉన్నప్పటికీ ఫ్రీజ్ డ్రైడ్ ఫుడ్స్ నేటికీ ఉపయోగిస్తూనే ఉన్నారు.

అంతరిక్ష నౌకల్లో నీటిని నిల్వ చేయాలంటే కోట్ల రూపాయల బడ్జెట్ కావాలి. లిక్విడ్ హైడ్రోజన్, ఆక్సిజన్‌ల కన్నా నీటి బరువు ఎక్కువ. అందుకే శాస్త్రవేత్తలు చెమట, మూత్రం, చివరకు ఊపిరిలోని తేమనీ కూడా పట్టి శుద్ధి చేసుకుని తాగేవారే. వాటిల్లోని సూక్ష్మజీవుల్ని పూర్తిగా నాశనం చేసి మరింత స్వచ్ఛమైన నీటిని అందించేందుకు నాసా 1970లలో ఒరెగాన్‌లోని ఉమ్క్వా రిసెర్చ్ కంపెనీతో కలిసి అయోడిన్‌తో కూడిన ఫిల్టర్ కానరటిడ్జ్‌లను తయారు చేసింది. మైక్రోబియల్ చెక్‌వాల్వ్‌లుగా పిలిచే వీటితో శుభ్రపరిచిన నీరు అప్పటివరకూ ఉన్న ఫిల్టర్లకన్నా స్వచ్ఛంగా ఉందట. దాంతో అరిజోనాకి చెందిన రే వార్డ్ అనే పరిశోధకుడు నాసా నుంచి ఆ టెక్నాలజీ తీసుకుని ట్యాప్‌కు అమర్చే ప్రొటోటైప్ వాటర్ ఫిల్టర్‌ను తయారుచేశాడు.



ఆపై అనేక కంపెనీలు ఆ టెక్నాలజీని మరింత అభివృద్ధి చేసుకుని తమవైన వాటర్ ఫిల్టర్లను రూపొందిస్తున్నారు. మున్సిపల్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లలోనూ ఈ విధానాన్నే వాడుతున్నారు. ఆ విధంగా నాసా పుణ్యమాని నేడు కోట్లాదిమంది సురక్షితమైన నీటిని తాగుతున్నారు.

## టూత్‌పేస్టుని మింగేయవచ్చు

అంతరిక్షంలో తాగడానికే నీళ్లుండవు. ఇక, బ్రష్ ఎలా చేయగలరు. అందుకే బ్రష్ చేసుకున్నాక మింగేసే టూత్‌పేస్టుని జాన్సన్ స్పేస్‌సెంటర్‌కు చెందిన డాక్టర్ ఇరా రూపొందించింది. నోటిలోని క్రిములూ బ్యాక్టీరియానూ చంపేసే దీనికి నీటి అవసరం కూడా ఉండదు మరి. పైగా నురగ కూడా రాదు. ఇంజెస్టబుల్ టూత్‌పేస్టులుగా ఇప్పుడివి మార్కెట్లోనూ ఉన్నాయి. ❑

కదల్లేని వీల్‌చెయిరన రోగులకీ పక్షవాతం వచ్చినవాళ్లకీ వాడుతున్నారు. మింగిలా ప్రమాదం ఉండదు కాబట్టి నాసాడెంట్ పేరుతో వస్తోన్న పేస్టుని పసివాళ్లకీ వాడొచ్చు అంటున్నారు నిపుణులు. దాంతో అనేక కంపెనీలు ఎడిబుల్ టూత్‌పేస్టుల్ని తెస్తున్నాయి.

## అంతరిక్ష ఔషధాలు

తినేవీ తాగేవాటిల్లోనే కాదు, వ్యోమగాముల ఆరోగ్యం కోసం ఎన్నో కనిపెట్టారు. అవన్నీ వైద్యరంగంలో పలు అడ్వాన్స్‌డ్ టెక్నిక్‌లుగా అందుబాటులోకి వచ్చాయి. రోదసిలో ఎక్కువ కాలం ఉంటే మూత్రపిండాల్లో రాళ్లు రావడంతోపాటు ఎముకలూ క్షీణిస్తాయి. అందుకే వాళ్లు కక్ష్యలో ఉన్నప్పుడు రోజుకు రెండున్నర గంటలు వ్యాయామం చేస్తారు. అయినప్పటికీ ఎముకలు ద్రవ్యరాశిని కోల్పోయి బోలుగా మారతాయి. దాంతో వాళ్లకోసం బిస్ఫాస్ఫోనేట్ అనే మందును రూపొందించారు. దీన్ని వారానికి ఒకసారి వాడితే నష్టం తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఇప్పుడు ఈ మందులు వృద్ధులకూ ఎముకల క్షీణత ఉన్నవాళ్లకీ కూడా ఉపయోగపడుతున్నాయి. ఆస్టియోపోరోసిస్ నివారణకు వాడుతోన్న డినోసుమాబ్ అనే ఔషధం కూడా అంతరిక్ష పరిశోధనకుల కోసం కనుగొన్నదే.

## కనిపించని బ్రేసెస్

నేడు ఎంతోమంది ఎత్తుగా ఉన్న దంతాల్ని సరిచేసుకునేందుకు వాడుతున్న ఇన్‌విజిబుల్ బ్రేసెస్ కూడా నాసా సంస్థ కనుగొన్నవే. మిస్సైల్ ట్రాకర్లలోని ఇన్‌ఫ్రారెడ్ ఆంటెన్నాల రక్షణకోసం పాలీక్రిస్టలైన్ ఆల్యూమినా అనే పారదర్శక పదార్థాన్ని తయారు చేసింది. ఇది స్టీలు కన్నా దృఢంగానూ అదే సమయంలో మృదువుగానూ ఉంటుంది.



1986లో అలాంటి పారదర్శక పదార్థం కోసమే ఎదురు చూస్తోన్న డెంటల్ కంపెనీలు నాసాతో కలిసి బ్రేసెస్‌ను రూపొందించాయి. లివర్‌పూల్ స్మైల్ స్టూడియో 'ఇన్‌విజాలిన్' పేరుతో వీటిని మొదట వాడిందట. వీటిని పెట్టి తీసుకునే వీలూ ఉండటంతో వేగంగా వాడుకలోకి వచ్చాయి.

## చెవిలో థర్మోమీటర్

నక్షత్రాల ఉష్ణోగ్రతను తెలుసుకోవాలంటే సాధారణమైన థర్మోమీటర్లు పనిచేయవు. అందుకే నాసా వాటినుంచి వెలువడే పరారుణకాంతిని లెక్కించగల శాటిలైట్‌ను రూపొందించింది. డయాటెక్ అనే కంపెనీ ఆ టెక్నాలజీని వాడుకుని, ఇన్‌ఫ్రారెడ్ సెన్సర్లతో పనిచేసే థర్మోమీటర్‌ను రూపొందించింది. ఇది కర్ణభేరి నుంచి వచ్చే శక్తిని కొలవడం ద్వారా శరీర ఉష్ణోగ్రతను చెబుతుంది. పైగా దీన్ని చెవి దగ్గర రెండు సెకన్లు ఉంచితే చాలు. అదే సాధారణ థర్మోమీటర్‌ను నోట్లో లేదా చంకల్లో పెడితే పిల్లలు కుదురుగా ఉంచుకోరు. కాబట్టి ఆసుపత్రుల్లో వీటిని ఎక్కువగా వాడుతున్నారు.

అంతరిక్షం నుంచి నేలమీదకి దిగే సమయంలోనే వ్యోమగాములకు మరింత రక్షణ అవసరం. అది దృష్టిలో పెట్టుకునే నాసా మెమరీ ఫోమ్‌ని కనిపెట్టింది. చార్లెస్ యోస్ట్ అనే ఏరోనాటికల్ ఇంజినీర్ 1960లలో స్ప్రింగ్‌బ్యాక్ సాంకేతిక విజ్ఞానం సాయంతో అధిక పీడనాన్ని వికేంద్రీకరించగల పాలీ యురిథేన్ సిలికాన్ ఫోమ్‌ను కనుగొన్నారు. ఎక్కువసేపు కూర్చోవాలి కాబట్టి దీన్ని మొదట విమానం సీట్లలో ఉపయోగించారు. ఆపై డల్లాస్ కౌబాయ్స్ ఫుట్‌బాల్ బృందానికి తలకీ దెబ్బలు తగలకుండా ఉండేందుకు హెల్మెట్లలో వాడారు. ఇది బెడ్‌సోర్స్ నివారణకూ ఎలర్జీ బాధితులకీ మంచిది అని తెలియడంతో అనేక కంపెనీలు దిండ్లూ పరుపులూ తయారు చేస్తున్నాయి. ❑

## పేరు తెచ్చిన సంపద

**(15వ పేజీ తరువాయి)**

ఫోన్ ద్వారా అవసరమైన వారికి సరైన తగిన పేరు ఎంపిక చేసి చెప్పుండే హాంఫ్రీకి కస్టమర్ల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండటం విశేషం.

ఒక్కొక్కప్పుడు తల్లిదండ్రుల ఆర్థిక స్థితిగతులు, వారి స్వభావాన్ని బట్టి ఫీజు విషయంలో ఆమె కాస్తంత హెచ్చు తగ్గులు అనుసరిస్తుంటారు. పేరు పెట్టడం కూడా ఒక పనేనా అని ఎవరైనా అనుకోవచ్చు. ఇంటర్నెట్టులో సెర్చులో కెళ్తే పేరు దొరుకుతుంది కదాని అడగొచ్చు. కానీ హాంఫ్రీ 'ఈ పని అంత సులభం కాదు' అని అంటారు. అదేమిటంటే పిల్లల పేరెంట్స్ జీవితంలో మరిచిపోలేని సంఘటనలు, ప్రదేశాలు జోడించి ఆ మధుర జ్ఞాపకాలను జీవితాంతం గుర్తుంచుకునేలా పేరు ఉండాలని అంటుంటారట. ఇటువంటివన్నీ మనసులో పెట్టుకుని తాను పేరు సూచిస్తుంటానని ఆమె అన్నారు. కొంతమంది జంటలు శిశువులకు పేరు పెట్టడానికి మాత్రమే కాకుండా, ప్రసవ సమయంలో గర్భిణీ స్త్రీలకు సహాయం చేయడానికి, మద్దతు ఇవ్వడానికి కూడా ఆమె సేవలను వినియోగించుకుంటారు. న్యూయార్క్ యూనివర్సిటీలో డిగ్రీ చేసిన హాంఫ్రీ ఈ వ్యాపారాన్ని ప్రారంభించే ముందు రకరకాల వృత్తులు చేశారు.

ఇది కాకుండా, ఆమె ఈవెంట్ ప్లానర్‌గా కూడా పని చేశారు. అలాగే హాంఫ్రీ తన లింక్డ్ ఇన్ ప్రొఫైల్‌లో తనను తాను రేకీ ప్రాక్టీషనర్‌గా కూడా చెప్పుకున్నారు. రెండు సినిమాలకు స్క్రీన్‌ప్లే కూడా రాసిచ్చిన ఆమె టిక్‌టాక్‌లో కూడా తనకుంటూ ఓ ప్రత్యేకతను చాటుకున్నారు. కారణం, ఆమె టిక్‌టాక్‌లో తరచూ ఉచిత చిట్కాలను ఇస్తుంటారు. హాంఫ్రీ మాట్లాడుతూ, చాలామంది తల్లిదండ్రులు ఎప్పుడో పెట్టిన తమ పిల్లల పేర్లను మార్చమని కోరుతుంటారని అన్నారు. తమ పిల్లలకు పరిపూర్ణత కలగాలనే ఆశతోనే పేర్లు పెట్టించుకోవడానికి తల్లిదండ్రులు తన వద్దకు వస్తుంటారని, తను పేరు పెట్టడం వల్ల కలిసొస్తుందనే నమ్మకమున్న వారే తనను సంప్రదిస్తుంటారని ఆమె మాట. కొందరు తల్లిదండ్రులు పేరు ఫలానా మాటతో ఆరంభం కావాలని, మరికొందరు తామనుకున్న భావం పేరు మధ్యలో ఉండాలని అంటుంటారట. ఏదైతేనేం, హాంఫ్రీ వ్యాపారం మూడుపేర్లు ఆరు డాలర్లు (మాట వరసకు)గా దినదినాభివృద్ధి చెందుతోంది. ❑

కథ

# వలపు ఊయల

తాళ్ళూరి లక్ష్మి

"హలో సూర్యగారూ!"
సుపరిచితమైన గొంతు వినబడితే ఒక తెలిసినవాళ్ల పెళ్లి రిసెప్షన్‌లో ఎవరో పరిచయస్తుడితో మాట్లాడుతున్న సూర్యచంద్ర తల పక్కకి తిప్పి చూశాడు. ఎదురుగా లేత నీలం రంగు చీరలో మెరిసిపోతూ లహరి, ముఖాన ఎల్లప్పుడు ఉండే చెరగని చిరునవ్వుతో.

"లహరిగారా! మీరేమిటి ఇక్కడ?" ఆశ్చర్యపోతూ అడిగాడు సూర్య.

"నాదీ అదే ప్రశ్న!" చిలిపిగా అంది లహరి.

"పెళ్లికొడుకు నా దూరపు బంధువు" జవాబిచ్చాడు సూర్య.

"ఓహో! మగపెళ్లివారి తరపువారన్న మాట"

"అంటే మీరు ఆడపెళ్లివారి తాలూకానా?" "ఔను.. పెళ్లికూతురు నాకు తెలిసినవాళ్ల అమ్మాయి"



"అలానా.. రండి అలా లాన్‌లో కూర్చుని మాట్లాడుకుందాం"

ఇద్దరూ వెళ్లి పచ్చికలో ఒక ఖాళీ టేబుల్ చూసుకుని కూర్చున్నారు, సర్వర్లు అందిస్తున్న చిరు ఫలహారాలు తింటూ.

"ఇలా అనుకోకుండా మూడోసారి కలవడాన్ని ఏమంటారో తెలుసా?" సీరియస్‌గా మొహం పెట్టి అన్నాడు సూర్య.

"ఏమంటారేమిటి?"

"మొదటిసారి కలవడం అనుకోకుండా అయితే, రెండోసారి కలవడం యాదృచ్ఛికం అనీ, మూడోసారి కలవడాన్ని కావల్సి చేసిందనీ అంటారు". "అంటే నేను కావాలనే కలిశానంటారా?" బుంగమూతి పెట్టి అడిగింది లహరి.

"అమ్మో, అటువంటిదేమీ లేదు. ఊరికే సరదాగా అన్నాను. మీరు అడక్కుండానే దేవుడిచ్చిన వరం లాంటివారు"

"అబ్బో! మునగచెట్టు ఎక్కించకండి"

"నిజంగా మనస్ఫూర్తిగా అంటున్నాను. ఇక్కడ బాగా తెలిసిన వారెవరూ లేరు, సమయం ఎలా గడపడమా అని మథన పడుతుంటే మీరు ఎడారిలో ఒయాసిస్సు లాగా కనబడ్డారు".

"ఇక్కడా అంతే"

వాళ్లలా సరదాగా మాట్లాడుకుంటుంటే రెండు గంటలు ఇట్టే గడిచిపోయాయి. వధూవరులిద్దరినీ పలకరించి, భోజనం చేసి ఇద్దరూ ఇళ్లకి బయలుదేరారు.

బయలుదేరుతుండగా సూర్య అడిగాడు "తిరిగి పునఃదర్శనమెప్పుడో?"

"అమ్మో! తిరిగి అనుకోకుండా కలిస్తే దానికేమి పేరు పెడతారో ఏమో. ఎందుకైనా మంచిది... ఈసారి ముందే అనుకుని కలుసుకుందాం. పోనీ, ఒక పని చెయకూడదూ.. ఈ ఆదివారం మా ఇంటికి డిన్నర్‌కి వచ్చేయండి. నాన్నగారూ, అన్నయ్యలు అందరూ ఇంటిపట్టునే ఉంటారు, పరిచయం చేస్తాను" ఆహ్వానాన్ని అందజేసింది లహరి.

"మీ వాళ్లేమీ అనుకోరుగా! మీకేమీ అసౌకర్యం కాదు కదా!" అనుమానం వెళ్లబుచ్చాడు సూర్య.

"అటువంటిదేమీ లేదు. మీరు వచ్చేయండి. అందరం కలిసి సరదాగా ఒక సాయంత్రం గడపొచ్చు".

"అలాగైతే సరే. గుడ్ నైట్"

.........

కారు డ్రైవ్ చేసుకుంటూ ఇంటికి వెళ్తుండగా సూర్య మనసులో లహరితో పరిచయానికి దారి తీసిన సంఘటనలు ఒకదాని వెంట ఒకటి తిరగసాగాయి.

దాదాపు మూడు నెలల క్రితం ఊటీలో ఏర్పాటు చేసిన ఒక ట్రైనింగ్ ప్రోగ్రాంకి సూర్యని పంపించింది అతను ఫైనాన్స్ మేనేజర్‌గా పని చేస్తున్న ఒక బహుళ జాతీయ సంస్థ.

ముందు రోజు రాత్రే ప్రోగ్రాం జరుగుతున్న హోటల్ చేరుకున్న సూర్య మర్నాటి పొద్దుటే రూంలోనే బ్రేక్‌ఫాస్ట్ చేసి కాన్ఫరెన్స్ హాలుకి చేరుకున్నాడు. నిర్వాహకులు అందచేసిన కోర్సు కాగితాలు చూస్తుంటే అందులో పాల్గొంటున్న వ్యక్తుల వివరాలు కనిపించాయి. అతనితో కలిపి ఇరవై మందిదాకా ఉన్నారు. వారిలో తనదిగాక మరొకరి స్వస్థలం వైజాగ్ అని ఉండడం చూసి వివరాలు పరిశీలించాడు. ఆ వ్యక్తి పేరు లహరి అని, ఒక ఐ.టి. కంపెనీలో మానవ వనరుల మేనేజర్ అని ఉంది. అక్కడ కూర్చున్న అయిదుగురు అమ్మాయిలలో ఎవరై ఉంటారా? అని ఊహించడానికి ప్రయత్నించాడు, కానీ సాధ్యపడలేదు.

ఆ తరువాత ప్రోగ్రాం డైరెక్టర్ క్లాసు మొదలెట్టాక అందరూ తమని తాము పరిచయం చేసుకుంటున్నప్పుడు ఆ అమ్మాయెవరో తెలిసింది. మనిషి చామనఛాయలో, కాంతివంతమైన ముఖవర్ఛస్సుతో, చిరునవ్వు చిందించే కళ్లతో చూడగానే నచ్చేలా అందంగా, నాజూగ్గా, ఆకర్షణీయంగా ఉంది. అందరి పరిచయాలు అయిపోయాక టీ బ్రేక్‌లో కాఫీ తాగుతుండగా లహరి వచ్చి తనను తను పరిచయం చేసుకుంది "మీది కూడా వైజాగేనా?" అంటూ. ఆ విధంగా మొదలైంది లహరితో సూర్య పరిచయం.

ప్రోగ్రాం మొదలయ్యాక క్లాసుని నలుగురేసి చొప్పున ఐదు బృందాలుగా విభజించారు. ప్రోగ్రాం జరిగిన ఐదు రోజులూ ఆ ఐదు బృందాలూ తమకిచ్చిన సమస్యలని తమలో తాము చర్చించి పరిష్కారాలు సమర్పించాలి. వాటిలో అన్నిటికన్నా బాగున్న పరిష్కారానికి బహుమతి ఉంటుంది. సూర్య అదృష్టమో ఏమో అతని బృందంలో లహరి కూడా ఉంది. లహరితో సూర్య సన్నిహితత్వం పెరగడానికి అదెంతో దోహదం చేసింది. బృందంలో మిగతా ఇద్దరూ నార్త్ ఇండియన్స్ కావడంతో లహరీ, సూర్యలు మరింత చేరువవడానికి అవకాశం లభించింది.

లహరి మంచి మాటకారి. ఎప్పుడూ నవ్వుతూ చలాకీగా ఉంటుంది. ఎవరితోనైనా ఇట్టే కలిసిపోగల నైపుణ్యం ఆమె స్వంతం. చాలా తెలివైన అమ్మాయి కూడా. ప్రోగ్రాంలో ఇచ్చే సమస్యలకి రకరకాల పరిష్కారాలు సూచించేది. ప్రోగ్రాం చివరలో బహుమతి కూడా సొంతం చేసుకుంది. ఆమె సాంగత్యంలో ప్రోగ్రాం ఐదు రోజులూ ఇట్టే గడిచిపోయాయి సూర్యకు. రోజూ క్లాస్ అయిపోగానే సాయంత్రంపూట ఇద్దరూ కలిసి ఊటీలో ఉన్న పర్యాటక ప్రదేశాలన్నీ తిరిగేవారు. ఒకరోజు ఊటీ లేక్‌లో బోటింగ్, ఇంకో రోజు టాయ్ ట్రైన్ రైడ్, మరోరోజు బొటానికల్ గార్డెన్, కలహట్టి వాటర్‌ఫాల్స్ ట్రిప్... ఇలా ప్రతిరోజు ఏదో ఒక ప్రదేశానికి వెళ్లేవారు. ఒకరోజు పొద్దుటే లేచి దొడ్డబెట్ట వెళ్లారు. ఆకాశంలో మబ్బులు మనుషులని తాకుతున్నట్లుండే ఆ అనుభవమే వేరు. చుట్టూతా లోయల్లో దట్టమైన చెట్లు. చల్లటి గాలులు రివ్వున వీస్తుంటే సూర్యోదయ సమయాన భూతల స్వర్గంలో ఉన్న అనుభూతి.

చలికి కొంకర్లు పోతున్న చేతులతో వేడి వేడి ఫిల్టర్ కాఫీ పట్టుకుని తాగుతుంటే అమృతమే తాగుతున్నంత హాయి. చక్కటి అనుభూతులనిచ్చిన ఆ ప్రోగ్రాం ముగియగానే సూర్య, లహరి వైజాగ్ తిరిగొచ్చేశారు. ఎయిర్‌పోర్టులో ఒకరి ఫోన్ నెంబర్లు ఒకరు తీసుకున్నారు, తిరిగి ఎప్పుడైనా కలుద్దామని. అయితే దాదాపు నెల దాకా ఆఫీసు పనులతో తీరిక చిక్కక సూర్యకి లహరితో మాట్లాడడానికి కుదరలేదు, ఆమె జ్ఞాపకాలు వెన్నాడుతున్నా.

ఒకరోజు సూర్య వాళ్లమ్మగారి పుట్టినరోజు సందర్భాన డైమండ్ నెక్లెస్ కొందామని గోల్డ్ షాప్‌కి వెళ్లాడు. నెక్లెస్‌లు చూస్తుండగా వెనకనుంచి "హాలో!" అని పిలుపు వినిపిస్తే ఎవరా? అని తిరిగి చూశాడు. ఎదురుగా చిరు మందహాసంతో లహరి.

"నెక్లెస్ మీ శ్రీమతికా?" కుతూహలంగా అడిగింది లహరి.

"నాకింకా పెళ్లే కాకపోతే భార్య ఎక్కడి నుంచి వస్తుంది. ఇది మా అమ్మగారి కోసమని చూస్తున్నాను" అన్నాడు సూర్య.

అప్పుడు తట్టింది సూర్యకి తామిద్దరూ ఇంతవరకు ఆఫీసు విషయాలు తప్ప తమ వ్యక్తిగత విషయాల గురించి ఎప్పుడూ మాట్లాడుకోలేదని.

లహరికి కూడా అదే ఆలోచన వచ్చిందేమో! "సారీ! మీ గురించి ఇంతవరకు ఏమీ తెలుసుకోలేదు. ఇంతకీ విశేషమేమిటి?" అని అడిగింది.

"రేపు మా అమ్మగారి పుట్టినరోజు. ఏదైనా మంచి నెక్లెస్ బహుమతిగా ఇద్దామనుకుంటున్నాను. నాకు ఈ నగల ఎంపిక బొత్తిగా రాదు. అనుకోకుండా కలిశారు. కొంచెం సహాయం చేస్తారా?"

"ముందు మీ అమ్మగారి వివరాలు చెప్పండి. అంటే.. వయసు, శరీరఛాయ, లావా, సన్నమా... వగైరా...వగైరా".

"అంత కష్టమక్కరలేదు లహరిగారూ. నా పర్సులో అమ్మఫోటో ఉంది. అది చాలు మీరు సెలెక్ట్ చెయ్యడానికి" అని ఫోటో తీసి చూపించాడు.

"మీలాగే మీ అమ్మగారు కూడా చాలా బాగున్నారు" అంది లహరి. "మీ పొగడ్తకి చాలా థాంక్స్" మనస్ఫూర్తిగా అన్నాడు సూర్య.

లహరి అందంగా ఉన్న నెక్లెస్ ఒకటి ఎంపిక చేసింది. కొనడం అయిపోయాక సూర్య "నా కోసం చాలా కష్టపడ్డారు. పక్కనే మేఘాలయ ఉంది. వెళ్లి మంచి కాఫీ తాగుదాం పదండి" అన్నాడు.

"ఇంత కష్టపడితే వట్టి కాఫీయేనా?" లహరి నిష్టూరమాడింది.

"ముందు పదండి. మీరడగాలే కానీ ఏది కావాలన్నా ఇప్పిస్తా".

హోటల్లో కూర్చున్నాక "మీ అమ్మగారు చాలా అదృష్టవంతులు, ఇంత మంచి కొడుకుని కన్నందుకు" అంది లహరి. "అదేమిటి? అలా అనేశారు". "అవును. ఈ కాలం అబ్బాయిలు ప్రియురాళ్ల లేదా భార్యల పుట్టిన రోజులు గుర్తు పెట్టుకుని బహుమతులిస్తారు. కానీ మీలా కన్నతల్లి జన్మదినం గుర్తు పెట్టుకుని కానుకలు ఇచ్చేవారు ఎందరు?"

"లహరిగారూ! మా అమ్మ మా కోసం పడిన కష్టాలు వెల కట్టి తిరిగి ఇవ్వాలంటే వెయ్యి జన్మలెత్తినా సరిపోదు. నేను, మా అక్క ఇందుమతి ఈ రోజు ఇంత మంచి స్థితిలో ఉన్నామంటే దానికి ముఖ్య కారణం అమ్మ చేసిన త్యాగాలు. నాన్న మా చిన్నతనంలోనే పోతే నాన్న ఉద్యోగం అమ్మకు లభించింది. అప్పటినుంచీ తను తినీ తినక నన్నూ, అక్కయ్యనీ బాగా చదివించి మమ్మల్ని ప్రయోజకుల్ని చేసింది. ఆఫీసు పనులు, ఇంటి పనులు, మాకు చదువులు చెప్పడం, ఆవిడ పడిన కష్టాలు ఎంత చెప్పినా తక్కువే. ఆవిడ మాకు చేసిన దాని ముందు ఈ చిన్నిపాటి కానుకలు ఏపాటి?" భావోద్వేగాలు కుదిపేశాయి సూర్యని.

**"అంత తొందరేమీ లేదులెండి. ఇప్పుడిప్పుడే ఉద్యోగంలో స్థిరపడుతున్నవాడిని. మరికొంత కాలం ఇలానే గడపాలని అనుకుంటున్నాను". "ఏం? ఎవరైనా మనసులో ఉన్నారా?"**

అతను మామూలు మనిషి కావడానికి రెండు క్షణాలు ఆగి, తిరిగి అడిగింది లహరి.. "అక్కయ్యగారు ఏం చేస్తుంటారు?" అని. "మా అక్కకి పెళ్లైపోయింది. తనూ, బావగారూ ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు. ప్రస్తుతం ఇద్దరూ ఆస్ట్రేలియాలో పని చేస్తున్నారు".

"అలాగా! అంటే మీ అక్కయ్యగారు జీవితంలో స్థిరపడిపోయారన్న మాట. ఇంక మిమ్మల్ని కూడా ఒక ఇంటివాడిని చేసేస్తే మీ అమ్మగారు కాలు మీద కాలు వేసి కూర్చోవచ్చన్న మాట".

"అంత తొందరేమీ లేదులెండి. ఇప్పుడిప్పుడే ఉద్యోగంలో స్థిరపడుతున్నవాడిని. మరికొంత కాలం ఇలానే గడపాలని అనుకుంటున్నాను".

"ఏం? ఎవరైనా మనసులో ఉన్నారా?" "ఇప్పటిదకా అలాంటిదేమీ లేదు. భవిష్యత్తు గురించైతే చెప్పలేను".

ఇద్దరూ మరికొంతసేపు పిచ్చాపాటి మాట్లాడుకుని టిఫిన్, కాఫీలు కానిచ్చి బయటకొచ్చారు. బయలుదేరేముందు సూర్య "లహరిగారూ, రేపు సాయంత్రం మీరు మా ఇంటికి రండి, అమ్మ పుట్టినరోజు సంతోషంగా జరుపుకోవచ్చు" అన్నాడు.

"తప్పకుండా వస్తాను" ఠక్కున ఒప్పుకుంది లహరి.

అన్నట్లే మర్నాడు సాయంత్రం ఠంచనుగా అనుకున్న సమయానికి కొద్దిగా ముందే వచ్చింది లహరి. వచ్చీ రాగానే "ఆంటీ, ఆంటీ" అంటూ సూర్య వాళ్ల అమ్మగారిని అతుక్కుపోయి ఆవిడకి వంట చేయడంలో సహాయం చేయడంతో పాటు ఆవిడని కొత్త చీరలో అందంగా ముస్తాబు చేసి, తను తెచ్చిన కేక్ కోయించి నానా హడావిడీ చేసింది.

ఉన్నది ముగ్గురే ఐనా పది మంది పెట్టు హంగామా చేసి ఆవిడ పుట్టినరోజు వేడుక ఎంతో ఆనందంగా జరిగేటట్టు చేసింది.

భోజనాలయ్యాక లహరిని సాగనంపుతూ అన్నాడు సూర్య "థాంక్స్ లహరిగారూ, మేమెప్పుడూ ఇంత సంతోషంగా పుట్టినరోజు వేడుక జరుపుకోలేదు. అమ్మ మొహంలో ఈరోజు నేను చూసిన ఆనందం, సంతృప్తి నా జన్మలో మరచిపోలేను".

.........

వెనక నుంచి ఏదో కారు హారన్ వినబడితే ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాడు సూర్య. తీపి జ్ఞాపకాలు గుర్తుకొస్తుంటే మనసంతా హాయిగా అనిపించింది. వాళ్ల అమ్మగారి పుట్టినరోజు తరువాత లహరిని కలవడం తిరిగి ఈరోజే. లహరిని మళ్లీ కలవడానికి ఆదివారం ఎప్పుడెప్పుడు వస్తుందా అని ఎదురు చూడసాగాడు.

ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఆ ఆదివారం రానే వచ్చింది. సూర్య సాయంత్రం ఏడు గంటల కల్లా సిరిపురంలో ఉన్న లహరివాళ్ల ఇల్లు చేరుకున్నాడు. అర ఎకరంలో ఉన్న మూడంస్థుల భవనం అది. ముందర పెద్ద పోర్టికో.. అందులో నాలుగు కార్లు ఉన్నాయి. పక్కనే ఒక లాను, దాన్లో ఒక తూగుటుయ్యాల. ప్రహరీగోడ చుట్టూ అర డజనుదాకా కొబ్బరిచెట్లు, రెండు మామిడిచెట్లు ఉన్నాయి. సూర్య కారు ఆపి గేటు దగ్గరకు రాగానే వాచ్‌మాన్ గేటు తీసి "సూర్యగారా?" అని అడిగాడు.

"అవుననగానే" "లహరమ్మగారు చెప్పారు మీరొస్తారని, రండి" అంటూ ఇంటి లోపలి డ్రాయింగ్ రూమ్‌లోకి తీసుకెళ్లాడు.

సూర్య సోఫాలో కూర్చొన్న రెండు నిమిషాలకే లహరి వచ్చేసింది "హల్లో సూర్యగారూ" అంటూ.

మల్లెపువ్వులాంటి తెల్లటి బెంగాల్ కాటన్ చీర కట్టుకుని ఎంతో హుందాగా, కడిగిన ముత్యంలా ఉంది. ఆమె వెనకాలే వచ్చిన వంటమనిషి ఒక ట్రేలో మంచినీళ్లు, పళ్లరసం తెచ్చిచ్చింది.

లహరితో మాట్లాడుతూ సూర్య పళ్లరసం తీసుకుంటుండగా లహరి వాళ్ల నాన్నగారు, అమ్మగారు వచ్చారు. లహరి వాళ్లని పరిచయం చేసింది "మా నాన్నగారు ప్రభాకర్ గారు, రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్. మా అమ్మ అరుంధతి" అంటూ. మరికొద్దిసేపట్లో పై అంతస్థులలో ఉన్న లహరి ఇద్దరన్నయ్యలు, వదినలు కూడా వచ్చి కలిశారు. లహరి వాళ్లని కూడా పరిచయం చేసింది "మా పెద్దన్నయ్య తేజ. మా తాతగారు స్థాపించిన ఫార్మా కంపెనీ నడుపుతున్నాడు. చిన్నన్నయ్య డాక్టర్ సిద్దార్థ. స్టేట్స్‌లో కార్డియాక్ సర్జన్‌గా పని చేస్తున్నాడు. సెలవు మీద ఇక్కడికొచ్చాడు".

పరస్పర పరిచయాలవగానే అందరూ మాటల్లో పడిపోయారు. లహరిలానే వాళ్లన్నయ్యలిద్దరూ బాగా కలుపుగోలు మనుష్యులు. సూర్యతో ఇట్టే కలిసిపోయారు. ఏమాత్రం భేషజాలు లేకుండా. వయసు మీద పడిన ప్రభాకర్‌గారు మాత్రం హుందాగా, మౌనమూర్తిలా కూర్చొన్నారు వాళ్ల మాటలు వింటూ, అప్పుడప్పుడూ మాటలు కలుపుతూ.

మాటల్లో పడి ఎవరికీ సమయం కూడా తెలీలేదు వంటమనిషి వచ్చి డిన్నర్ సిద్ధమైందని చెప్పేదాకా. డిన్నర్ అయిపోయాక డ్రాయింగ్ రూమ్‌లో ఒంటరిగా తన పక్కనే కూర్చొన్న సూర్యతో అన్నారు ప్రభాకర్‌గారు "బాబూ సూర్యా! మీ అక్కయ్య ఆస్ట్రేలియాలో ఉంటుందన్నావు కదూ. ఒక చిన్న హెల్ప్ చేయగలవా? మా లహరికి ఈ మధ్యనే ఆస్ట్రేలియాలో ఉంటున్న ఒక సంబంధం వచ్చింది. అబ్బాయి ఐఎఫ్ఎస్ కాడర్. ఇండియన్ హై కమిషన్‌లో పని చేస్తున్నాడట. మా కులస్తుడేనట కూడా. అతని వివరాలు వాట్సప్ చేస్తాను. మీ అక్కయ్య గారిని ఆ సంబంధం గురించి వాకబు చెయ్యమని చెబుతావా?"



సూర్య ఆయనకు జవాబిచ్చేలోగా లోపలి నుంచి లహరి, వాళ్ల అన్నయ్యలు వచ్చారు ట్రేలలో ఐస్‌క్రీమ్, ఫ్రూట్‌సలాడ్ పట్టుకుని.

అవి తినడం అయిపోయాక మరికొద్దిసేపు వారితో గడిపి, అందరికీ వీడ్కోలు చెప్పి ఇంటికి బయలుదేరాడు సూర్య తన కారులో.

సాయంత్రమంతా సరదాగా గడిచినా కూడా సూర్య మనసులో ఎక్కడో ఏదో మూల ముల్లు గుచ్చుకున్నట్టుగా ఉంది. వేపకాయ తిన్నట్టు నోరంతా చేదుగా ఉంది. అందని ద్రాక్షపళ్ల కోసం అర్రులు చాస్తున్నానా అని పదే పదే అనుకొన్నాడు.

.........

మర్నాడు పొద్దుట లేవగానే హాల్లో నుంచి ఏవో సుపరిచిత కంఠస్వరాలు వినబడితే ఎవరొచ్చారా? అని పడగ్గదిలో నుంచి హాల్లోకొచ్చి చూశాడు సూర్య. ఎదురుగా అక్కయ్య ఇందుమతి, బావగారు చక్రధర్. కాఫీ తాగుతూ అమ్మతో మాట్లాడుతున్నారు. వాళ్లనక్కడ చూసి ఆశ్చర్యపోయాడు.

అడిగితే "మీ ఇద్దరినీ ఆశ్చర్యపరుద్దామని ఇలా చెప్పా చెప్పకుండా వచ్చేశాం. మీ బావగారికి ఇక్కడ పది రోజులు ఆఫీసుపని పడింది. ఇదే మంచి అవకాశం అని నేనూ సెలవు పెట్టి వచ్చేశాను".

అక్కయ్య, బావగారు రావడంతో ఇల్లంతా సందడి మొదలైంది. సూర్యని రాత్రి ఆవరించుకున్న శూన్యత మటుమాయమైంది.

ఇందుమతి సూర్యతో "ఈరోజు ఆఫీసుకు సెలవు పెట్టేయి. హాయిగా కబుర్లు చెప్పుకుందాం" అంటే సూర్య ఇంట్లోనే ఉండిపోయాడు.

బావగారు బ్రేక్‌ఫాస్ట్ చేసి ఆఫీసు పని మీద బయటకు వెళ్లిపోయారు.

సూర్య, ఇందుమతి, వాళ్ల అమ్మగారు హాల్లో యోగక్షేమాలు మాట్లాడుకుంటూ కూర్చున్నారు. కొద్దిసేపయ్యాక వాళ్లమ్మగారు "మీరిద్దరు మాట్లాడుకుంటూ ఉండండిరా. నేనొక కునుకేసి వస్తాను" అని పడగ్గదిలోకి వెళ్లిపోయింది. సూర్య, ఇందుమతి ఏవో మాటల్లో పడ్డారు. మాటల మధ్యలో ఇందుమతి అడిగింది "ఏరా సూర్యా, పెళ్లి గురించి ఏమైనా ఆలోచించావా? అమ్మ కూడా పెద్దదౌతోంది".

"ఇంకా ఏమీ ఆలోచించలేదక్కా" అన్నాడు సూర్య.

"అంతేనా, లేక మనసులో ఎవరైనా ఉన్నారా?" ప్రశ్నించింది ఇందుమతి.

"ఛ.. అలాంటిదేమీ లేదక్కా" అన్నాడు సూర్య, మనసులో ఎక్కడో లహరి ముఖం దోబూచులాడుతున్నా.

"అమ్మ ఈ మధ్య ఫోన్ చేసినప్పుడు చెప్పింది నీ ఫ్రెండ్ ఎవరో లహరిట. మనింటికొచ్చిందట కదా. ఆ అమ్మాయి చాలా కలుపుగోలు మనిషని, తనకి ఎంతో బాగా నచ్చిందని చెప్పింది. ఆ అమ్మాయి కూడా నువ్వంటే ఇష్టపడుతున్నట్టు అనిపించిందని చెప్పింది. ఎవరా అమ్మాయి?"

లహరి తనకెలాగ పరిచయమైందో చెప్పాడు సూర్య. ఇందుమతి అడిగింది "ఆ అమ్మాయి గురించి నీ అభిప్రాయం ఏమిటి?" అని. "లహరికేం, చక్కటి అమ్మాయి. ఎవరికైనా ఇట్టే నచ్చుతుంది" అన్నాడు సూర్య.

"మరైతే ఆ అమ్మాయిని నువ్వే పెళ్లి చేసుకోవచ్చుగా" ఇందుమతి అడిగింది.

"వాళ్లంతస్తు వేరు, మన అంతస్తు వేరు. వాళ్లు ఎన్నో తరాలుగా సంపన్న కుటుంబీకులు. మనం సామాన్య మధ్య తరగతి వాళ్లం. దేవుడి దయవల్ల ఇప్పుడిప్పుడే పైకి వస్తున్నవాళ్లం. వాళ్లకీ, మనకీ పొసగదనుకుంటున్నాను. పైగా లహరి నాన్నగారు లహరికి వాళ్ల అంతస్తుకి తగ్గట్టుగా గొప్ప, గొప్ప సంబంధాలు చూస్తున్నారు. అంతేకాదు, ఆయనకి కుల పట్టింపు కూడా ఉన్నట్టనిపించింది".

అదటుంచు. నువ్వెప్పుడైనా లహరి మనసు తెలుసుకోడానికి ప్రయత్నించావా?"

"లేదక్కా.. అంత సాహసించలేదు. తను కాదంటే ఒక మంచి స్నేహితురాలిని పోగొట్టుకుంటానేమోనని భయం. లహరితో మాట్లాడుతున్నప్పుడు కాలం ఎలా గడిచిపోతుందో కూడా తెలీదు. అంత మంచి మిత్రురాలిని ఏ పరిస్థితులలోనూ పోగొట్టుకూడదు అనిపించింది".

"సరేరా, నీ ఆవేదనను అర్థం చేసుకోగలను. పోనీ, ఒకసారి లహరిని పరిచయం చేస్తావా?"

"ఈ సాయంత్రమే లహరిని పరిచయం చేస్తాను. బావగారు రాగానే ముగ్గురం కలిసి ఎక్కడికైనా డిన్నరుకి వెళదాం. లహరికి కూడా అక్కడికి రమ్మంటాను".

.........

"సారీ సూర్యగారూ! సరిగ్గా బయలుదేరుతున్న సమయంలో బాసుదేవుడు పిలిచాడు. అందువల్ల రావడం కొంచెం లేటయింది" ఆదరా బాదరాగా వచ్చినట్టుంది, ఆయాసపడుతూ అంది లహరి.

సూర్య ఎదురుగా కూర్చొన్న అక్క, బావగార్లను చూస్తూ "మీరు ఇందుమతి గారు, మీరు మిస్టర్ ఇందుమతిగారు.. అవునా?" అని గలగలా నవ్వేసింది.

"సారీ, మీ పేరు తెలియదు కదా, అందుకని అలా అనేశాను" అంది చక్రధర్‌తో.

ఇందుమతి ఆ అమ్మాయిని మురిపెంగా చూస్తూ "బాగా అల్లరి పిల్లలా ఉన్నావు" అంది.

"అంతే కదక్కా, ఇంట్లో అందరికన్నా చిన్నదాన్ని. అందుకే అల్లరి బాగా వంటబట్టింది" ఇందుమతితో సంబంధం కూడా కలిపేస్తూ అంది లహరి.

రామకృష్ణా బీచ్ దగ్గర ఒక రెస్టారెంట్‌లో కూర్చొన్నారు వాళ్లు. ఎదురుగా అలల ఉధృతి. దూరంగా లంగరేసిన ఓడలు.

ఇందుమతి సూర్యతో అంది "నువ్వు, బావగారూ మాట్లాడుకుంటూ కూర్చోండిరా. నేను, లహరి ఇలా ఇసుకలో ఒక చుట్టు చుట్టి వస్తాం. ఇసుకలో నడిచి చాలా రోజులైంది కూడాను".

"లహరీ, మా సూర్య గురించి నీ అభిప్రాయం ఏమిటి?" అడిగింది ఇందుమతి. "సూర్యానా... ఒక్క మాటలో చెప్పాలంటే చాలా చాలా మంచివారు. "మంచివాడా కాదా అని కాదు. వాడితో జీవితం పంచుకోవడం గురించి నీ అభిప్రాయమేమిటని?"

ఇందుమతి, లహరి కొద్దిసేపు ఇసుకలో నడిచాక లహరి అడిగింది "ఏమైనా చెప్పాలా అక్కా?" ఆ అమ్మాయి సూక్ష్మబుద్ధికి చకితురాలైంది ఇందుమతి. అంత చురుకైన అమ్మాయితో దాగుడు మూతలు అనవసరమని సూటిగా అడిగేసింది "లహరీ, మా సూర్య గురించి నీ అభిప్రాయం ఏమిటి?"

"సూర్యానా... ఒక్క మాటలో చెప్పాలంటే చాలా చాలా మంచివారు.

"మంచివాడా కాదా అని కాదు. వాడితో జీవితం పంచుకోవడం గురించి నీ అభిప్రాయమేమిటని?"

"ఆయన తెలుసుకోమని పంపించారా?"

"ఊహూ..! వాడికేమీ తెలియదు. నేనే అడుగుతున్నా"

"ఇంత సూటిగా అడుగుతున్నారు కనుక నేనూ సూటిగానే చెప్పేస్తాను. ఆయన ఎప్పుడు పెళ్లి ప్రతిపాదన తెస్తారా? అని నేను ఎన్నో రోజుల్నుంచి ఎదురు చూస్తున్నాను".

"నాకు తెలిసి ఆ రోజు ఎప్పటికీ రాదనుకుంటాను. వాడికెన్నో అనుమానాలు, అపోహలూ. తనకు తాను వేసుకున్న సంకెళ్ల నుంచి వాడంతట వాడు బయట పడలేడు".

"అంటే?" "వాడి మొదటి అనుమానం మన కుటుంబాల మధ్యనున్న అంతస్తుల తారతమ్యం మీ పెద్దలు ఈ పెళ్లికి అంగీకారం తెలపడానికి అడ్డు పడుతుందని".

"మనసులు కలిసినప్పుడు అంతస్తుల తారతమ్యం అడ్డుగోడ ఎలాగా అవుతుందక్కా. నేను సూర్యని మనఃస్ఫూర్తిగా ఇష్టపడ్డాను. అతనితో జీవితాంతం సుఖపడగలనన్న నమ్మకం ఉంది. ఇద్దరి జీవితాలు ముడిపడడానికి ఇంతకన్నా కావాల్సినదేముందక్కా"

"సూర్య రెండో అనుమానం.. మన కుల తారతమ్యాలు. మీ నాన్నగారు కులాంతర వివాహానికి ఏమాత్రం ఒప్పుకోరనే సందేహం. అందుకే తన ప్రేమని బహిర్గతం చేయడానికి జంకుతున్నాడు, పొరపాటున ఆ ప్రేమ విఫలమైతే ఒక మంచి స్నేహితురాలిని పోగొట్టుకోవలసి వస్తుందని".

"మా కుటుంబం మరీ అంత సంకుచిత మనస్తత్వంది కాదక్కా. నేను మనసు పడ్డానంటే ఎటువంటి వ్యక్తికిచ్చైనా వివాహం చేస్తారు సంతోషంగా, ఎటువంటి అభ్యంతరం చెప్పకుండా. నాకు ఆ నమ్మకం, విశ్వాసం, ధైర్యం ఉన్నాయి. ఆ ముద్దపప్పే ఈ విషయం గ్రహించలేకపోతున్నాడు ఎన్ని సంకేతాలిచ్చినా".

"ముద్దపప్పా... మా సూర్యకి మంచి పేరే పెట్టావు. ఇంక ఆలస్యమెందుకు. ఆ ముద్దపప్పుని నీ వైపు తిప్పుకో".

"మాట్లాడుకోవడం అయిపోవడంతో ఇద్దరూ వెనక్కి తిరిగారు.

"మరో విషయం.. ఇక నుంచి అక్కా అని పిలవడం మానేసి వదినా అని పిలవడం నేర్చుకో" ఇందుమతి ఆజ్ఞ జారీ చేసింది.

"అలాగే అక్కా... సారీ వదినా" లహరి మాటలకు ఇద్దరూ పగలబడి నవ్వుకున్నారు.

రెస్టారెంట్‌కి చేరుకోగానే ఇందుమతి భర్తతో అంది "పదండి ఈసారి మనిద్దరం బీచంతా తిరిగొద్దాం. లహరి మన ముద్దపప్పుతో ఏదో మాట్లాడుతుందట".

"ముద్దపప్పా?" అర్థంగాక అయోమయంగా చూశాడు సూర్య.

"ఆ విషయం లహరి చెబుతుందిలే. మీరిద్దరూ మాట్లాడుకుంటూ ఉండండి. బావగారూ, నేనూ అలా తిరిగొస్తాం" భర్తను తీసుకుని ఇందుమతి వెళ్లిపోయింది.

తననే కళ్లార్పకుండా చూస్తున్న లహరిని చూస్తూ ఈ అమ్మాయికీరోజు కొత్తగా ఏమైంది అనుకుంటూ ఏదో మాట్లాడబోయాడు సూర్య.

అతడినేమీ మాట్లాడవద్దని సైగ చేస్తూ అతని రెండు చేతుల్ని తన చేతుల్లోకి ఆర్తిగా తీసుకుంది లహరి.

# అభ్యుదయ దీపశిఖ 'గుఱ్ఱం జాషువా'

డా॥ దేవులపల్లి పద్మజ




గుఱ్ఱం జాషువా ఒక అద్భుత అభ్యుదయ తెలుగు రచయిత. సామాజిక స్పృహ కలిగిన రచనలు ప్రధానంగా పేదరికం, అంటరానితనంపై పోరు సాగించాయి. అయినప్పటికీ భావ వ్యక్తీకరణలో దేశభక్తి తొణికిసలాడుతూ ఉంటుంది. ఆయన రచనలు ఆధునిక భావాలతో నిండి వుంటాయి. రచనా విధానాలను జాగ్రత్తగా పరిశీలిస్తే చిన్నతనంలో ఆయన ఎదుర్కొన్న అమానుష, అసాంఘిక విధివిధానాలు, పరిస్థితులు కారణంగా కనిపిస్తాయి. వాటికి వ్యతిరేకంగా ఆయన మనసు ఆలోచించటం మొదలు పెట్టినట్లుగా తెలుస్తుంది. గుఱ్ఱం జాషువాను ఏదో ఒక కులానికి చెందిన వ్యక్తిగా చిత్రీకరించటం సరికాదు. జన్మరీత్యా క్రైస్తవ కులానికి చెందినప్పటికీ అనేక సందర్భాలలో హిందూత్వ సిద్ధాంతాలను గౌరవించినట్లు మనకు తేటతెల్లమవుతుంది. అంతేకాకుండా అనేక విషయాలను హిందూత్వ ప్రభావానికి లోనై రచనలు సాగించారు. ఈ రచనా పోకడలు తన కులంవారి ఆగ్రహానికి గురి కావలసి వచ్చినప్పటికీ లక్ష్యపెట్టక, తన వ్యక్తిత్వ విలువలతో రాజీపడక ముందుకు సాగిపోయారు.

అభ్యుదయ భావాలతో నిండి నిభిడీకృతమైన ఆయన రచనా వ్యాసంగం సమాజంలోని అణగారిన వ్యక్తుల అభ్యున్నతికి అడుగడుగునా తపించి వారి ఉద్ధరణకు తోడ్పడింది. జాషువా గారి రచనా వైదుష్యానికి ముగ్ధుడైన బ్రాహ్మణ కులానికి చెందిన చెళ్ళపల్లి వేంకటశాస్త్రిగారు ఆయనను ఎంతగానో కొనియాడారు.



సమభావనల విజ్ఞాన విలువలు జన హృదయాలలో చిగురించినప్పుడే విశ్వమానవాళి సమానత్వానికి దోహదపడుతుందని ప్రగాఢంగా నమ్మిన వ్యక్తి. మహాత్మాగాంధీ హత్యోదంతానికి మనోవేదన చెంది తీవ్ర పదజాలంలో ఖండించి, దేశభక్తిని, మహాత్మాగాంధి పట్ల తనకున్న గౌరవ ప్రపత్తులను చాటుకుంటూ తీవ్రవాదానికి, అనైతిక, అసాంఘిక కార్యక్రమాలకు వ్యతిరేకంగా నిలబడ్డారు. ఉన్నత వ్యక్తిత్వ విలువలు, విశ్వ సౌభ్రాతృత్వం వంటి భావనలు పాదుకొన్న వ్యక్తికి సమాజంలో ఎదురుండదని తన రచనల ద్వారా నిరూపించారు.

ధర్మబద్ధ జీవన విధి విధానాలు అనుసరించిన వ్యక్తికి గుర్తింపు కుసుమానికి సహజంగా పరిమళం అబ్బినట్లు సిద్ధిస్తాయని ఆయన రచనలు ఆకళింపు చేసుకున్న ప్రతీ వ్యక్తికి అర్థమవుతుంది. కుల, మత, వర్ణ విచక్షణ లేకుండా అందరికీ వారి వారి ప్రాధాన్యంగా స్థానం ఉండాలని తన పద్య, నాటక, కవితా మార్గాలలో సమాజానికి సందేశం, మార్గనిర్దేశనం చేశారు. ఆయన 65 గ్రంథాలు, ఎన్నో కవితా ఖండికలు రాసారు.

జాషువా గారి కావ్యమైన 'గబ్బిలం' మనోజ్ఞమై, సమాజంలో అణగారిన బడుగు జీవులకు మార్గదర్శనమై వెలుగురేఖలు నింపింది. నీలినీడల కుల వైషమ్యాల అంతర్భావనలు ఆవిష్కరించింది. తరతమ భేదం లేకుండా అందరి ప్రశంసలకు పాత్రమైనది. కనీస భావ వ్యక్తీకరణకు కూడా నోచుకోని లక్షలాది బడుగు జీవుల గొంతై భువనభోంతరాళాలు ప్రతిధ్వనించింది. ఖండకావ్య ప్రక్రియకు జీవం పోసారు.

తన 'గబ్బిలం' కావ్యంపై జాషువా గారి అభిప్రాయం

"కాళిదాసుని మేఘసందేశము దృష్టిలో నుంచుకుని నేనీ కావ్యమును రచించితిని. కావ్యనామము శ్రోతలకు కటువుగా తోచవచ్చును. మేఘసందేశములో కథానాయకుడు ప్రణయ సందేశము పంపును. కానీ ఇందు ఇతడంపునది తుకతుక నుడుకు నశ్రు సందేశము. అతని శిక్షా కాలపరిమితి ఒక సంవత్సరము. ఇతని శిక్ష ఆజన్మాంతము, తరతరాలు. దీనికి అవధి లేదు. అతను మన్మధాగ్ని తప్తుడు. ఇతడు క్షుదాగ్ని పీడితుడు".

**"నాదు కన్నీటి కథ సమన్వయము**
**సేయు నార్ద్ర హృదయంబులు గూడగొంతవసరంబు".**

జాషువా, ఆనాటి సామాజిక పోకడల కోరల జ్వాలలో విలవిలలాడిన వేదన కారణాన తీవ్ర మనోమథనంతో సానబెట్టిన వజ్రంలా, విల్లు ఎక్కుపెట్టి లాగి విడిచిన శరీంలా, ఉవ్వెత్తున ఎగిసిన కెరటంలా సమాజంలో ప్రకాశించారు.

తన రచనల ద్వారా, ప్రముఖ హిందూ పండితుల ప్రోత్సాహకరమైన ప్రశంసలను ఆస్వాదించారు. ఆయన సంస్కృత భాషపై జూపూడి హనుమాన్ శాస్త్రి గారు, దీపాల పిచ్చయ్య శాస్త్రి గారి వద్ద అభ్యసించారు. పొందిన మేలు మరువరాదన్న ఉన్నత వ్యక్తిత్వంతో తన కృతజ్ఞతలు "నా కథ" అనే రచనలో పొందుపరిచారు. ఆయన రచనలో హిందూత్వానికి సంబంధించిన దుర్వావిజయం, కుశలోపాఖ్యానం, కన్యకాపరమేశ్వరి వంటి రచనలు స్థానం పొందాయి.

వారి పద్య రచన సందర్భోచితమైన చమత్కార ధోరణిలో సాగేవి. ఫిరదౌసిలో మహారాజును పండితులందరూ సున్నితంగా హెచ్చరిస్తూ ఓ కవిని అవమానించటం, మోసం చేయడం తమ వంటి మహాప్రభువులకు జయం కాదని చెప్తూ ఈ పద్యం..

**ఓ భూపతి! రాజేంద్ర!! ఆలకించుమా మా విన్నపము**
**దాదాపు నాల్గు వందల మంది కవులు గా**
**నము సేయు మీ దివాణంబు లేవి**
**అల్లాకు బ్రీతి సేయం గాఫరులమీది**
**కుఱుకు మీకత్తి వాదర పసందు**
**సకలించి శత్రుమత్సరము వెల్లడిచేసి**
**కాల్దువ్వు మీ ఘోటకముల పసరు**
**పసిడి జల్తారు టంబారీల యొఱపున**
**దిరుగు మీ గజముల గరువతనము**

**మా యవన రాజ్యమునకు బూరాయులని**
**తలచుకొనుచుండు మెపుడు సుల్తాను వృషభ!**
**లలితకళలు వడంబించు నెలవు మీదు**
**నిందుకొలువున కవుల కన్నీరు తగదు.**

(మిగతా 26వ పేజీలో...)

షేక్ అబ్దుల్ హాకీం జాని

# అతి పెద్ద నీటి మార్గం సూయజ్ కాలువ

**ప్రపంచంలోని** అతి పెద్ద మానవ నిర్మిత నౌకా నీటి మార్గం ఈజిప్టులోని సూయజ్ కాలువ. క్రీ.శ. 1869లో దీనిని ప్రారంభించారు. యూరప్, ఆసియాల మధ్య జల రవాణా కోసం ఆఫ్రికాను చుట్టిరాకుండా దగ్గర మార్గానికి అనువైనది. ఈజిప్టులోని నైలునది, మధ్యధరా సముద్రం రెండింటినీ ఎర్ర సముద్రంతో అనుసంధానించడానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. నైలునది శాఖల ద్వారా మధ్యధరా, ఎర్రసముద్రాలను అనుసంధానించిన తొలి వ్యక్తి మూడవ ఫరో సెనుస్రెట్. ఇలా అనేకమంది ఫరోలు, రోమన్లతో పాటు ఒమర్ దిగ్రేట్ శతాబ్దాలుగా ఇతర మార్గాలను నిర్మించారుగానీ అవి అంతగా ఉపయోగపడలేదు. ఆ తరువాత 1700 సంవత్సరం చివరలో నెపోలియన్ బోనపార్టే ఈజిప్టుకు యాత్ర నిర్వహించినప్పుడు తొలిసారిగా ఆధునిక ప్రతిపాదనలు తీసుకుని వచ్చారు. నిపుణులు పరిశీలించి మధ్యధరా సముద్రం కంటే ఎర్రసముద్రం 30 అడుగుల ఎత్తులో ఉన్నట్లు చెప్పడంతో రెండింటినీ అనుసంధానం చేస్తే ఎర్రసముద్రం నీటితో మధ్యధరా సముద్ర ప్రాంతం మునిగిపోతుందని చెప్పడంతో ఫ్రెంచ్ చక్రవర్తి నెపోలియన్ అనుసంధాన కార్యక్రమాన్ని విరమించుకున్నారు. తరువాత 1839లో ఒక ఫ్రెంచ్ దౌత్యవేత్త, ఇంజినీర్ ఫెర్డినాండ్ డి లెస్సెప్స్ ఈజిప్టు వైస్రాయ్ సయ్యద్ పాషాను కాలువ నిర్మాణానికి సహకరించమని ఒప్పించినప్పుడు తదుపరి ప్రయత్నం జరిగింది. 1850లో ఈజిప్టు పాలకుడు మహమ్మద్ సయ్యద్ పాషా ఫ్రెంచి ఇంజినీర్ పరిశోధనను తెలుసుకుని రెండు సముద్రాలను కలిపే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆ తరువాత 1858లో ఫెర్డినాండ్ డి లెస్సెప్స్ పర్యవేక్షణలో యూనివర్సల్ సూయజ్ షిప్ కెనాల్ కంపెనీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఏడు దేశాలకు చెందిన 13 మంది సివిల్ ఇంజినీర్లతో ఒక కమీషన్‌ను వేశారు. వీరంతా రెండేళ్ల పాటు అధ్యయనం చేసి కాలువ వెడల్పు, లోతు ఎంత ఉండాలనే విషయమై ఒక అంచనాకు వచ్చారు. 7.5 కోట్ల క్యూబి మీటర్ల ఇసుకను తవ్వడంతో పాటు కాలువ పూర్తయ్యే నాటికి రూ.10 కోట్లు ఖర్చయింది. సూయజ్ కాల్వ కోసం ఈజిప్టు దేశాన్ని బ్రిటన్ సొంతం చేసుకుంది. 1892లో ఈజిప్టుకు స్వాతంత్ర్యం వచ్చింది.

ఇలా అనేక సంఘటనల నడుమ ప్రారంభమైన సూయజ్ కెనాల్ ఓ కృత్రిమ జలసంధి లాంటిది. ఆఫ్రికా, ఆసియాలను విడదీస్తుంది. దీనికి ఉత్తర కొస వైపు సైడ్ రేవు, దక్షిణ కొస వైపు సూయజ్ నగరంలోని టెవ్ఫిక్ రేవు వున్నాయి. దక్షిణం వైపున పయనించిన ఈ కాలువ మెంజాల కొలనులో కలుస్తుంది. ఆ తరువాత ఈ కొలను దాటి కాంతార పర్వతశ్రేణి గుండా ప్రవహించి తిరుష్ సరస్సులో కలసి అక్కడి నుండి శెరహమ్ పర్వతాలను దాటి బిట్టర్ సరస్సులో కలుస్తుంది. అనంతరం సూయజ్ కాలువ ఈ సరస్సును దాటి ఎర్ర సముద్రంలో కలుస్తుంది. వర్తకం నిమిత్తం పలు దేశాలవారు బ్రిటన్ వెళ్లాలంటే ఆఫ్రికా ఖండాన్ని చుట్టి వెళ్లవలసి వచ్చేది. సూయజ్ కాల్వ నిర్మాణంతో భారీగా దూరం తగ్గింది. మధ్యధరా, ఎర్రసముద్రాల అనుసంధానంపై ఈజిప్ట్ రాజుల చూపు పడింది. రెండు సముద్రాల అనుసంధానంపై ఫ్రెంచ్ ఇంజినీరు బెల్లిఫోండ్స్ పరిశోధన చేశారు. క్రీ.శ.1850లో పనులకు శ్రీకారం చుట్టిన ఈజిప్టు చక్రవర్తి మహమ్మద్ సయ్యద్ పాషా. ఈ పనులను ఫ్రెంచ్ వ్యాపారవేత్త ఫెర్డినాండ్‌కు అప్పగించారు. కార్మికులు తిరుగుబాటు వల్ల కొంత కాలం పనులు నిలిచిపోయాయి. ప్రపంచంలోని వస్తువులను ఒకచోటు నుండి మరో చోటుకు తరలించడంతో సూయజ్ కాలువ ప్రపంచ వాణిజ్యంపై గణనీయమైన ప్రభావం చూపింది.

సూయజ్ కాలువ పరిమాణ ప్రారంభంలో 25 అడుగులు లోతు, ఎగువన 72 అడుగుల వెడల్పు, దిగువన 200 నుండి 300 వరకు వెడల్పు ఉండేది. తరువాత ఈ పరిణామాల్లో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. నౌకా ప్రయాణాలు ప్రారంభం సూయజ్ కాలువ ఆసియా, ఐరోపాలను కలుపు తుంది. మధ్యధరా, ఎర్రసముద్రాలను కలుపుతూ 1859-1869 మధ్యలో దీన్ని నిర్మించారు. ఈ కాల్వ తవ్వకాలలో ఈజిప్టుకు చెందిన 20 లక్షల మంది కార్మికులు పని చేసినట్లు చరిత్రకారుల అంచనా. కార్మికులు 24 గంటలు పని చేశారు. ప్రతి షిఫ్టులో 30 వేలకు తగ్గకుండా కార్మికులు పని చేసేవారు. 1869 నవంబర్ 17న సూయజ్ కాల్వను ప్రారంభించారు. అట్లాంటిక్ మహాసముద్రం, హిందూ మహాసముద్రం, పశ్చిమ పసిఫిక్ మహా సముద్రాలతో కలిపే సూయజ్ కాలువ నిత్యం రద్దీగా ఉంటుంది. 1870లో ఈ కాలువగుండా ఏడాదికి 486 నౌకలు ప్రయాణించాయి. 1966లో 21,250 నౌకలు, 2018లో 18,174 నౌకలు ప్రయాణించాయి.

ఇప్పుడు సూయజ్ కాలువ ఇరువైపులా ఉన్న అప్రోచ్ కాలువలతో కలిపి ఈ కాలువ పొడవు 101 మైళ్లు. వెడల్పు 984 అడుగులు. దీన్ని ఈజిప్టుకు చెందిన సూయజ్ కెనాల్ అథారిటీచే నిర్వహిసోంది. రోజుకు దాదాపు 50 నౌకలు ఈ కాలువ గుండా ప్రయాణిస్తాయి.



2020లో 18,500 పైచిలుకు నౌకలు ఈ కాలువ గుండా ప్రయాణించాయని అంచనా. నెపోలియన్ క్రీ.శ.1798లో సూయజ్ కెనాల్ నిర్మాణానికి ఒక కమిటీని వేశారు. కానీ ఆ కార్యక్రమం మధ్యలోనే నిలిచిపోయింది. తిరిగి క్రీ.శ.1859 పోర్ట్‌సెడ్ వద్ద తొలిసారిగా కాలువ కోసం భూమిని తవ్వడం ప్రారంభించారు. అలా 1859లో ప్రారంభమైన ఈ కాలువ 100 మిలియన్ వ్యయంతో అధికారికంగా క్రీ.శ.1869 నవంబర్ 17 నాటికి పూర్తి చేసి వాణిజ్య నౌకల ప్రయాణానికి ద్వారం తెరిచారు. కొన్ని సందర్భాలలో భారీ సరుకు రవాణా నౌకలు సూయజ్ కాలువలో అడ్డంగా ఇరుక్కుపోయి రాకపోకలకు అంతరాయం కలిగిన సందర్భాలు కూడా ఉన్నాయి.

## విభేదాలు



సూయజ్ కెనాల్ వాడకం, నియంత్రణ మొ॥ విషయాలపై అనేక విభేదాలు తలెత్తాయి. 1936లో సూయజ్ కెనాల్ జోన్‌లో సైనిక దళాలను నిర్వహించడానికి, ఎంట్రీ పాయింట్లను నియంత్రించే హక్కు యునైటెడ్ కింగ్‌డమ్‌కు ఇచ్చారు. 1954లో ఈజిప్ట్‌తో పాటు యునైటెడ్ కింగ్‌డమ్ ఏడు సంవత్సరాల ఒప్పందంపై సంతకం చేశాయి. దీని ఫలితంగా కాలువ ప్రాంతం నుండి బ్రిటిష్ దళాలు ఉపసంహరించి ఈజిప్ట్, పూర్వపు బ్రిటిష్ సంస్థాపనలను నియంత్రించటానికి అనుమతినిచ్చారు. 1948లో ఇజ్రాయెల్ ఏర్పడటంతో ఈజిప్టు ప్రభుత్వం తమ దేశం నుండి ఓడల రాకపోకలను నిషేధించింది.

## సంక్షోభం

మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలు జరిగిన సమయంలో సైతం ఇది అత్యంత కీలకమైన ప్రాంతంగా మారింది. 1956 అక్టోబర్ 29న ఇజ్రాయెల్ ఈజిప్టుపై దాడి చేసింది. ఈ సంక్షోభం ఇలా ఉండగా కొన్ని దేశాలు సూయజ్ కెనాల్ గుండా తమ వాణిజ్య నౌకల ప్రయాణాన్ని కొనసాగించారు. ఇది నచ్చని ఈజిప్టు దాదాపు 40 నౌకలను ముంచేయడంతో మరో సంక్షోభం ఏర్పడింది. సోవియట్ యూనియన్ ఈజిప్టుకు సైనిక పరంగా మద్దతునిచ్చింది. 1956 జులై 25న సూయజ్ కాల్వను జాతీయం చేశారు. 1960, 1970లో ఈజిప్ట్, ఇజ్రాయెల్ మధ్య విభేదాల కారణంగా సూయజ్ కాలువను పలుమార్లు మూసివేశారు. ఈ కాలువ 1973కు ముందు ఎనిమిదేళ్లపాటు మూసివేశారు. ఆ సమయంలో జరిగిన యుద్ధం వల్ల అనేక నౌకలు సూయజ్ కెనాల్‌లో చిక్కుకున్నాయి. చివరకు సూయజ్ సంక్షోభం ఐక్యరాజ్యసమితికి చేరి చర్చలు జరిగి, కాల్పుల విరమణతో ఈ సంక్షోభం ముగిసింది. ఐక్యరాజ్యసమితి నాలుగు దేశాల మధ్య సంధి ఏర్పాటు చేయడంతో ఈ వివాదానికి తెర పడింది. అనంతరం యూనివర్సల్ సూయజ్ షిప్ కెనాల్ కంపెనీ ఈ కాలువపై పూర్తి నియంత్రణను దక్కించుకుంది. ఈజిప్ట్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం జరిగిన 1960-70 మధ్య కాలంలో తప్ప అన్ని సమయాలలో అతి ముఖ్యమైన నౌకలు సూయజ్ కాలువ గుండా ప్రయాణించాయి. 1973లో ఈజిప్టు, ఇజ్రాయెల్ మధ్య శాంతి ఒప్పందం జరిగింది. ఆ తరువాత బలగాలను వెనక్కు పిలిపించి 1975 జూన్ 5న సూయజ్ కాల్వను తిరిగి ప్రారంభించారు. ఏడాదికి 15 వేలకు పైగా నౌకలు ఈ కాలువ గుండా ప్రయాణించి 15 శాతం సరుకులు రవాణా చేస్తున్నట్లు అంచనా. అతి పెద్ద అత్యాధునిక నౌకలు సూయజ్ కాలువలో ప్రయాణించడం కష్టంతో కూడుకున్న విషయం. ఆ కారణంగా ఈ కాలువను ఆధునీకరించాలనే సన్నాహాలు చేస్తున్నారు. సూయజ్ కాలువ వర్తకం ఒకప్పుడు సముద్ర మార్గం ద్వారానే సాగేది. ఇప్పుడు విమానాలు సైతం అందుబాటులోకి వచ్చాయి. అత్యధిక బరువైన సరుకులను విమానాల కంటే, సముద్ర మార్గం ద్వారా సునాయాసంగా రవాణా చేయవచ్చు. అందువల్ల 80 శాతం వర్తకం సముద్రం మార్గం ద్వారానే సాగుతుంది. క్రీ.శ.16వ శతాబ్దం నుండే పోర్చుగల్, బ్రిటన్, డచ్ మొ॥ దేశాలు సముద్ర మార్గం ద్వారానే వ్యాపారాన్ని నిర్వహించాయి. మన దేశంతో పాటు ఇండోనేషియా, ఆస్ట్రేలియా దేశాల్లో బ్రిటన్ వ్యాపారాన్ని నౌకాయానం ద్వారానే సాగించారు. రోజుల తరబడి నౌకలపై సముద్ర మార్గంలో పయనించి సరుకును గమ్య స్థానాన్ని చేర్చేవారు. ఐరోపా దేశాల నుండి మన దేశానికి సముద్ర మార్గం ద్వారా సరుకునే తేవడానికి సముద్రంలో ఎటువంటి ఆటంకాలు కలగకుంటే దాదాపు 40 రోజులు పట్టేది. సూయజ్ కాల్వ ఏర్పడిన తరువాత ఐరోపా నుండి భారత్‌కు సముద్ర మార్గం ద్వారా రావడానికి 19 రోజులు మాత్రమే పట్టింది. సుమారు 8,500 కి.మీ. దూరం తగ్గింది. నాటి నుండి నేటి వరకు సూయజ్ కెనాల్ ప్రపంచ వాణిజ్యంలో ప్రధాన పాత్ర పోషిస్తోంది.

(24వ పేజీ తరువాయి..)

## అభ్యుదయ....

గజనీ, తన ఘన చరిత్ర 60,000 పద్యాలతో "షానామా" అనే గ్రంథం రాయించుకుని, పద్యానికొక స్వర్ణ నాణెం ఇస్తానని ఒప్పుకొని అనంతరం కవిని మోసం చేసిన సందర్భంలో కవుల చేత జాషువా గారు ఈ విధంగా పలికించారు. నవయుగ కవితా చక్రవర్తిగా పేరు గాంచిన జాషువాగారు 28 సెప్టెంబరు,1895లో జన్మించారు. తన రచనల ద్వారా, వ్యక్తిత్వ విలువల ద్వారా అనేక ప్రాంతీయ, జాతీయ అవార్డులు సొంతం చేసుకున్నారు. అనేక సామాజిక సంస్థలు, ప్రభుత్వ సంస్థలు ఆయనను ఘనంగా సన్మానించాయి. కుల, మత, వర్ణ వివక్షతల అడ్డుగోడలు అధిగమించటానికి మార్గదర్శనం చేసిన వ్యక్తిగా శ్లాఘించబడ్డారు. జాషువాగారు 'కవితా విశారద', 'కవికోకిల', 'నవయుగ కవి చక్రవర్తి', 'పద్మభూషణ్', 'కళాప్రపూర్ణ' మొదలైన బిరుదులు అందుకున్నారు. ఎన్నో సత్కారాలు అందుకున్నారు.

విశ్వమానవ జీవనంలో రాకపోకలు సహజమైనప్పటికీ వన్నె తరగని ఆణిముత్యంలా ప్రత్యేక స్థానం సంపాదించుకున్న కవితా చక్రవర్తి, జనహృదయాలలో స్థిర స్థానం సంపాదించుకున్న జాషువా అసమాన్య ప్రతిభా సమన్వితుడు, అమరుడు. నాటికీ, నేటికీ ఏనాటికీ పాఠకుల స్మృతిలో మెదిలే సాహితీవేత్త జాషువా.

## జోక్స్

### మూర్ఛ

తాను ఎంతగానో అభిమానించే నటి ఆత్మహత్య చేసుకుందన్న విషయం తెలిసి మూర్ఛపోయాడు ఓ వీరాభిమాని.

అయితే దీనికి సంబంధించిన బ్రేకింగ్ న్యూస్ అందరినీ నివ్వెరపరిచింది.


ఎందుకంటే తన వీరాభిమాని ఒకరు ఆత్మహత్య చేసుకున్నారని తెలిసి ఆ నటి మూర్ఛపోయింది.

### పనికొస్తాడని..

సరోజ: రాధా! పెళ్లి చేసుకోనన్నావుగా, మరెందుకు చేసుకున్నావు?

రాధ: సెల్ చార్జింగ్ పెట్టడానికి, సబ్బు అందించడానికి, తువ్వాలు అందించడానికి పనికొస్తాడని చేసుకున్నాను.

సరోజ: ఆ...



**- వై.ఈ.ఆర్,** విశాఖపట్నం

### ఆయిల్ ఎక్కువ

యజమాని: రోజూ ఇక్కడికే వచ్చి అడుక్కుంటావేంటి? పక్కన చాలా ఇళ్లున్నాయిగా.

బిచ్చగాడు: వాళ్ల కూరల్లో ఆయిల్ ఎక్కువగా వేస్తున్నారమ్మా, అందుకే మీ దగరికి వస్తాను.

యజమాని: ఏం? ఆయిల్ ఎక్కువగా ఉంటే తినవా?

బిచ్చగాడు: మా ఆవిడ ఆయిల్ ఎక్కువగా వేస్తుందనే బయటకి వచ్చి ఇలా అయ్యాను.

### అన్నదానం

పిసినారి భర్త : క్యాలెండర్ వెతుకుతుంటే కనపడ్డం లేదు, ఎక్కడ పెట్టావు?

భార్య: ఇప్పుడు క్యాలెండర్‌తో పని ఏముంది?

పిసినారి భర్త : అందులో వినాయక చవితి నవరాత్రులు ఎప్పుడో చూడాలి.

భార్య: మీకు దేవుడంటే అంత భక్తా?

పిసినారి భర్త: అదేంకాదు, వినాయక చవితి నవరాత్రుల్లో మండపాల దగ్గర ప్రతిరోజూ అన్నదానం చేస్తారు కదా అందుకని.

### చూడమన్నారుగా!

ఓనర్: నేను రెండు రోజులు ఊరికి వెళ్తున్నాను. దుకాణం జాగ్రత్తగా చూసుకో... అన్నాడు యజమాని.

వర్కర్: అలాగేనండి.

ఓనర్: (రెండు రోజుల తరువాత తిరిగి వచ్చి) దుకాణంలో దొంగలు పడి దోచేస్తుంటే ఏం చేస్తున్నావు? జాగ్రత్తగా చూసుకోమని చెప్పా కదా!

వర్కర్: చూసుకో.. అన్నారుగానీ దొంగతనం చేస్తుంటే ఆపు అనలేదు కదా! అందుకే చూస్తుండిపోయాను.

### వడ్డన బాగాలేదు

పెళ్లింట్లో వడ్డించేవాడు: భోజనాలు ఎలా ఉన్నాయి? కూరలన్నీ బాగున్నాయా?

తినే వ్యక్తి: వంటకాలన్నీ బాగున్నాయి కానీ ఒక్క విషయం మాత్రం అస్సలు బాగాలేదు.

వడ్డించే వ్యక్తి: ఏ విషయం?

తినే వ్యక్తి: గుడిలో ప్రసాదం పెట్టినట్లు కొంచెం కొంచెంగా వడ్డిస్తున్నారు... ఆ విషయం.

### ప్రశ్నలడుగుతాడు..

రాజు: అతను మందుపార్టీ ఇస్తానన్నా నువ్వు వెళ్లలేదేంటి?

గిరి: అతనితో వెళ్తే మనం వెళ్లడానికి ముందు చాలా జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు చదివి వెళ్లాలి.




రాజు: ఎందుకు?

గిరి: మందు తాగేటప్పుడు చాలా ప్రశ్నలు అడుగుతుంటాడు. వాటికి సమాధానం చెప్తేనే గ్లాసు నోట్లో పెట్టుకోనిస్తాడు.

### సెలవులివ్వాలి..

టీచర్: వర్షాలు పడుతున్నాయి కదా, మీరు ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

విద్యార్థి: ఆ జాగ్రత్తలేవో మీరే తీసుకోవాలి టీచర్!

టీచర్: మేమా? మేం ఏం జాగ్రత్తలు తీసుకోవాలి?

విద్యార్థి: ఇలా ఎడా పెడా స్కూల్స్ ఓపెన్ చెయ్యకుండా పది రోజులు వరుసగా స్కూలుకి సెలవులు ఇవ్వాలి.

### కేబుల్ ప్రసారాలు లేవు..

పోలీస్: నువ్వు పదే పదే ఆ కాలనీలోనే దొంగతనం చెయ్యడానికి కారణం ఏమిటి?


దొంగ: ఆ కాలనీలో కేబుల్ టీవీ ప్రసారాలు రావడం లేదు.

పోలీస్: కేబుల్ ప్రసారాలకి, దొంగతనానికి సంబంధం ఏంటి?

దొంగ:కేబుల్ ప్రసారాలు రాకపోవడం వల్ల రాత్రి తొమ్మిది గంటలకే అందరూ పడుకుంటున్నారు. నేను దొంగతనం చేయడం సులభమైంది.

**- ఎస్.కె.యాకుబ్ పాషా,** ఖమ్మం

## ప్యారడీ పాట



**"అక్కాచెల్లెలు" చిత్రంలోని "చిటాపటా చినుకులతో కరిసింది వాన" పాటకు ప్యారడీ.**

పల్లవి: వయ్యారపు నడకలతో వచ్చింది భామ
నిలుచుంది జాణ ॥వయ్యా॥

చరణం: చకా చకా తిప్పింది కళ్లు
వేసింది అడుగు
మళ్లీ మళ్లీ వేసింది అడుగు
అడుగు కాదది పడుచుపిల్ల బింకమే అది ॥వయ్యా॥

చరణం: నడుం మీద చెయ్యి వేసి చూసిందది
చూపులకు చురుకు వున్నది
పైటకొంగు వయసుతో ముద్దులాడింది
చీరేమో సిగ్గుపడింది ॥2॥ ॥వయ్యా॥

**- వైదా ఈశ్వరరావు,** విశాఖపట్నం



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



సాధారణ ఫలితాలు పొందుతారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలను శ్రద్ధగా నిర్వహిస్తారు. దూర ప్రాంత ప్రయాణాలు, అకాల భోజనం చికాకు కలిగిస్తాయి. వ్యాపారంలో స్తబ్దత ఏర్పడుతుంది. స్వర్ణాభరణాల పట్ల జాగ్రత్తలు పాటించండి. వృత్తి, ఉద్యోగాల పరంగా స్థాయి యథాతథంగా వుంటుంది. చాలా విషయాల్లో ఒంటరి పోరాటం చేస్తారు.

## వృషభం



మిశ్రమ ఫలితాలు గోచరిస్తున్నాయి. ప్రయాసతోగానీ పనులు సానుకూలపడవు. ఖర్చులు అధికంగా వున్నప్పటికీ సర్దుబాట్లను చేసుకుంటారు. వస్త్ర వ్యాపారస్తులు జాగ్రత్తతో మెలగాలి. ప్రింటింగ్, స్టేషనరీ వ్యాపారులకు అనుకూలం. సెంటిమెంట్ వస్తువుల పట్ల జాగ్రత్త వహించండి. భూ సంబంధ క్రయ-విక్రయాల్లో మధ్యవర్తిత్వాలకు తావివ్వకండి.

## మిథునం



గ్రహస్థితి అనుకూలంగా ఉంది. మీ ప్రణాళికలు, ఆలోచనలు, పద్ధతులు నిర్దిష్టమైన రూపం సంతరించుకుంటాయి. కుటుంబ సుఖ సంతోషాలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. వృత్తి, ఉద్యోగాల పరంగా పురోభివృద్ధి సాధిస్తారు. పని వత్తిడి వుంటుంది. కోపాన్ని, ఆవేశాన్ని అదుపులో ఉంచుకుంటే అనేకాంశాలను మీకు అనుకూలంగా మలచుకోవచ్చు.

## కర్కాటం



మిశ్రమ ఫలితాలు పొందుతారు. ఆదాయాన్ని మించిన ఖర్చులు ఉంటాయి. పెద్ద మొత్తాల్లో కొత్త పెట్టుబడులు పెడతారు. నలుగురిలో వున్నప్పటికీ ఒంటరిగా భావిస్తారు. బంధు, మిత్రుల నుండి శుభ వార్తలు వింటారు. వ్యాపార పరంగా తీసుకునేటటువంటి ఒప్పందాలు కలిసి వస్తాయి. ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది.

## సింహం



అనుకూలమైన సమయం. వర్క్ డిస్ట్రిబ్యూషన్‌ను సక్రమంగా చేసుకోగలుగుతారు. ప్రజా సంబంధాలు కలిగిన వ్యాపారస్తులకు అనుకూలంగా ఉంటుంది. అయితే ఇతరులు మాత్రం మీ పట్ల న్యాయంతో వ్యవహరించకపోవడం మిమ్మల్ని ఆలోచింపచేస్తుంది. అరమరికలు లేకుండా ఎదుటివారితో మీ మనోభావాలను పంచుకుంటారు.

## కన్య



సానుకూల ఫలితాలు పొందుతారు. మీ పనితీరు మెరుగ్గా ఉంటుంది. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు. గుప్తదానాలు చేస్తారు. రహస్య చర్చలను సాగిస్తారు. ముఖ్యమైన ఆర్థిక పత్రాలు సకాలంలో కనిపించక ఇబ్బందికి గురవుతారు. సంతాన పురోగతి బాగుంటుంది. వైద్య విధానాలలో నూతన పద్ధతులను అవలంభిస్తారు.

## తుల



మిశ్రమ ఫలితాలు పొందుతారు. అనేకాంశాలు మీకు అనుకూలంగా ఉంటాయి. పనివత్తిడి, ఆరోగ్యం సహకరించకపోవడం వల్ల మానసిక సౌఖ్యం లోపిస్తుంది. ఆర్థిక పరమైన లోటుపాట్లను తీర్చుకోవడానికి అధికంగా శ్రమించవలసి వస్తుంది. రహస్య వ్యూహాలను అవలంభిస్తారు. కుటుంబ సభ్యులతో కలిసి విహార యాత్రలు చేస్తారు. వాగ్వివాదం వల్ల కలిగే నష్టాలను అనుభవపూర్వకంగా తెలుసుకుంటారు.

## వృశ్చికం



సాధారణ ఫలితాలు గోచరిస్తున్నాయి. మానసిక ప్రశాంతతను సాధించడానికి ఆధ్యాత్మికత పైన దృష్టి కేంద్రీకరించడం మంచిది. ఆర్థికపరమైన ఒడుదుడుకులు ఏర్పడినప్పటికీ దైవానుగ్రహం రక్షిస్తుంది. అర్థంలేని వివాదాలు కాలహరణానికి కారణం అవుతాయి. చిన్న చిన్న వ్యవహారాలకు కూడా పరపతిని ఉపయోగించాల్సి వస్తుంది. సాధ్యమైనంతవరకు ముఖ్యమైన వ్యవహారాలను వాయిదా వేసుకోవడం ఉత్తమం.

## ధనుస్సు



సానుకూలంగా ఉంటుంది. రాజకీయ నాయకులతో మిత్రత్వం ఏర్పడుతుంది. ఆర్థిక పరమైన అంశాల పైన దృష్టి సారిస్తారు. పదునైన వస్తువులకు దూరంగా ఉండండి. దూర ప్రాంతాల్లో వున్న మీ వారి యోగక్షేమాలు విచారిస్తారు. సంతానానికి ఉన్నత విద్యావకాశాలు కలిసి వస్తాయి. పరిచయస్తులకు ఆర్థిక సహాయం అందిస్తారు. మీకు సంబంధించిన వ్యక్తిగత రహస్యాలను బహిర్గతం కాకుండా ఏర్పాట్లు చేసుకుంటారు.

## మకరం



మిశ్రమ ఫలితాలు పొందుతారు. కుటుంబ విషయంలో పురోగతికి చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. కొత్త రుణాలు చేస్తారు. పాత రుణాలను తీరుస్తారు. నూతన ఉద్యోగావకాశాలను అన్వేషించడంలో సఫలతను సాధిస్తారు. ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలో చూస్తారు. కీడెంచి మేలెంచమన్న విధంగా ఆలోచిస్తారు. తొందర పడకుండా నిదానంగా ఆలోచించి నిర్ణయాలు అమలు పరచడం మంచిది.

## కుంభం



అనుకూల ఫలితాలు ఉంటాయి. శక్తికి మించి శ్రమిస్తారు. క్రమశిక్షణకు ప్రాధాన్యమిస్తారు. ఆర్థిక పరమైన అంశాలు సంతృప్తికరంగా ఉంటాయి. ఓ పొరపాటు సమాచారం విని అదే నిజమని భ్రమపడతారు. వ్యాపార వ్యవహారాలు సున్నితమైన అంశాలతో ముడిపడి ఉంటాయి. దూర ప్రాంత ప్రయాణాల తాలూకు తేదీలను ఖరారు చేసుకుంటారు.

## మీనం



గ్రహస్థితి అనుకూలంగా ఉంటుంది. మొండికి పడిన పనులను సాధించుకుంటారు. వృత్తి, ఉద్యోగ రంగాలలో చెప్పుకోదగిన మార్పులేమీ ఉండవు. ఆర్థికంగా లాభ, నష్టాలు రెండూ ఉండవు. మిత్రులతో కలిసి వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. రాజకీయపరంగా చర్చలు సాగిస్తారు. తరతమ భేదం లేకుండా అందరినీ కలుపుకుని పని చేస్తారు. తద్వారా లాభపడతారు. బ్యాంకు రుణాలు అందివస్తాయి.

# ఉత్తరం దిక్కులో సెప్టిక్ ట్యాంక్ ఉండవచ్చా?


**వాస్తువార్త**

**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**

**డా॥ దంతూరి పండరినాథ్**

**3-2-4,** కింగ్స్‌వే, సికింద్రాబాద్

సెల్స్: **9885446501/9885449458**




### ఉత్తరం (మధ్యమ స్థానం)లో సెప్టిక్ ట్యాంక్-శుభం

ఉత్తరపు మధ్య భాగంలో సెప్టిక్ ట్యాంక్ తవ్వినట్లయితే మంచి ఫలితాలు ఉంటాయి. తూర్పు ఉత్తరాలకి ఓవర్‌ఫ్లో ఉండడం వల్ల సత్ఫలితాల సాంద్రత అధికమవుతుంది. తూర్పు ఉత్తరాలకు వీధులున్నప్పుడే ఇది సాధ్యమవుతుంది.

**శుభా శుభ ఫలితాలు:** ధన లాభం, పొదుపు, స్త్రీలకు మనోల్లాసం.

**Septic Tank in the North (Middle-grade location)-Favourable**

If a septic tank is dug in the middle of the North, it gives gainful results. If the overflow is towards the East or the North the gainful effect becomes more pronounced. This is possible only when there are roads to the East and the North.

**Result:** Monetary gains, good savings and cheerfulness to women.



### ఉత్తరం (నీచ స్థానం)లో సెప్టిక్ ట్యాంక్-మిశ్రమం

ఉత్తర మధ్య భాగంలో కాక వాయవ్యం(నీచ స్థానం) వైపు ఇంటి మూల పోటు రాకుండా సెప్టిక్ ట్యాంక్ నిర్మిస్తే సత్ఫలితాలుగానీ, దుష్ఫలితాలుగానీ తీవ్రంగా ఉండవు. ఓవర్‌ఫ్లో ఉత్తరానికి ఉంటే, దుష్ఫలితాల తీవ్రత తగ్గుతుంది.

**శుభా శుభ ఫలితాలు:** మిశ్రమ ఫలితాలుంటాయి.

**Septic Tank in the North (Low-grade location)-Mixed**

If a septic tank is built in the middle of the North or in the North-West(Low grade location) avoiding strike with the corner of the house, the results are neither significantly harmful nor gainful. If the overflow is towards the North the harmful effect gets reduced.

**Result:** Mixed results.

### ఉత్తర వాయవ్యంలో సెప్టిక్ ట్యాంక్(పోటు)-అశుభం

ఇంటి పశ్చిమ పారు నుండి ఉత్తర ప్రహరీగోడ వైపుకి తాడు పట్టి లాగినప్పుడు మధ్యలో సెప్టిక్ ట్యాంక్ వచ్చినట్లయితే అది ఉత్తర వాయవ్య సెప్టిక్ ట్యాంక్ పోటు అని గుర్తించాలి. సాధారణంగా ఇటువంటి టాంక్స్‌కి పశ్చిమ లేదా ఉత్తర ఓవర్‌ఫ్లో ఉంటుంది. రెండవదాని వలన చెడు ఫలితాల సాంద్రత పెరుగుతుంది.

**శుభా శుభ ఫలితాలు:** మానసిక రుగ్మతలు, ధన నాశనం.

**Septic Tank in the North North-West(Strike)-Unfavourable**

If a string, held straight from the Western boundary of the house to the Northern compound wall, encounters a septic tank then it should be considered as a strike of the North North-West septic tank. Generally such tanks have overflow towards the West or the North. The former increases the harmful effect.

**Result:** Psychic disorders and monetary losses.

### ఉత్తర వాయవ్యంలో సెప్టిక్ ట్యాంక్-అశుభం

పోటు లేకపోయినప్పటికీ ఉత్తర వాయవ్యంలో సెప్టిక్ ట్యాంక్ ఉన్నట్లయితే సత్ఫలితాలు ఉండవు. ఇటువంటి ట్యాంకులకు ఓవర్‌ఫ్లో ఉత్తరం వైపు అయితే చెడు ఫలితాల సాంద్రత తగ్గుతుంది. పశ్చిమం వైపు ఉన్నట్లయితే చెడు ఫలితాల సాంద్రత పెరుగుతుంది.

**శుభా శుభ ఫలితాలు:** వ్యాజ్యములు, వ్యసనములు.

**Septic Tank in the North North-West-Unfavourable**

When there is no strike and the septic tank is in the North North-West, there are no favorable effects. If the overflow of such a tank is towards the North the harmful effect gets reduced and if it is towards the West it gets increased.

**Result:** Litigation and evil addictions.

### వాయవ్యంలో సెప్టిక్ ట్యాంక్-అశుభం

పూర్తి వాయవ్య మూలలో సెప్టిక్ ట్యాంక్ ఉంటే, ఇంటికి ‘పోటు’ దోషం ఏర్పడుతుంది. ఇంటి వాయవ్య మూల నుండిగానీ, స్థలం ఆగ్నేయ మూల నుండి గానీ తాడు పట్టి స్థల వాయవ్య మూలకు లాగినప్పుడు ట్యాంక్ మీదుగా వస్తుంది. అప్పుడు ఇంటికి సెప్టిక్ ట్యాంక్ దోషం ఏర్పడుతుంది.

**శుభా శుభ ఫలితాలు:** మనస్థాపం, అనారోగ్యం, వ్యాజ్యాలు, ధన వ్యయం.


**Septic Tank in the North-West-Unfavourable**

If the septic tank is wholly in the North-West corner, the house acquires a strike flaw. When a string is held straight from either the North-West corner of the house or from the South-East of the plot to the North-West of the plot, it runs over the septic tank. In such case the house is said to have acquired the flaw of the septic tank.

**Result:** Mental worries, ill-health, litigation and expenditure.

# పదరంగం-6

**కూర్పు: పోపూరి విశ్వనాథ్**



## నిలువు

1) అవగాహన, అర్థం చేసుకోవడం (4)
2) ఒక శృంగార నాయిక (6)
3) చేకూరి రామారావు గారు ఇలా ప్రసిద్ధులు (2)
4) అనవసరంగా మధ్యలో దూరితే ....... పుడక అంటారు (4)
5) శివుని వాహనం (2)
6) సంతోషం (3)
10) జీరబోయిన గొంతు(4)
12) పొగరుబోతు, నేర్పరి (3)
15) శివుని వింటిపేరు (3)
16) వ్యూహ ప్రతివ్యూహాల గడుల ఆట (4)
18) పాండవుల తల్లులు తిరగబడ్డారు (4)
20) ఇంద్రజాల, మాయ (3)
22) తాడుతో వదిలి ఆడే పిల్లల వస్తువు పైకొచ్చింది (3)

## ఆధారాలు

### అడ్డం

1) ఈ వారం అందరికీ ఇష్టం (4)
4) పవిత్రం, పరిశుద్ధం (3)
6) పూజలాంటిది (4)
7) గట్టి, దయలేని (3)
8) శ్రావణ మాసంలో వచ్చే రెండవ (మామిడి) కాపు (3)
9) మాల (2)
11) ఇంతకుముందు (3)
13) ఒక చర్మవ్యాధి అటునించి పాకింది (2)
14) సిగ్గుతోటిది తిరగబడింది (2)
15) నగరాలలో ఈ పక్షి కనుమరుగవుతోంది (3)
16) విస్తారమైన గత కథ (3)
17) వెన్నెల (3)
19) హడావిడి, తొందర (3)
21) ఒడిశాలోని తెలుగువారి నగరం (4)
23) కొండెములు (3)
24) ఇనప బొగ్గుల పొయ్యి (3)
25) తిరగబడ్డ దేహం (2)

జవాబులు పంపించాల్సిన చిరునామా:
**పదరంగం** ఆదివారం వార్త, నం.396,
లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.

పేరు : ..........................................................


..........................................................


ఊరు : ..........................................................


## పదరంగం-4 జవాబులు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| అ[1] | దృ | ష్టి[2] | వం | తు[3] | డు | | గు[4] | మ్మ | టం[5] |
| న్న | | ఖా | | మ్ము | | | పె | | వా |
| మ[6] | న | సు | లు | | ఈ[7] | డే | రు | | తి |
| య్య | | క | | | గ | | | టు[8] | చే |
| | ఆ[9] | లు | మ[10] | గ | లు | | అ[11] | | |
| ఎ[12] | డం | | ణి | | | అ[13] | నా | మి | క[14] |
| | బ[15] | ద్ధ | క | స్తు | డు[16] | | మ | | వి |
| కా[17] | రం | | ట్టు | | తు[18] | ట్ట | తు | ద[19] | కు |
| క | | టు[20] | | మూ[21] | ర | | | క | |
| ర[22] | చ్చ | బం | డ | | భ[23] | ద్ర | కా | ళి | |

# ఈ వారం కా'ర్టూన్స్'


- ప్రామిస్ -
మా దగ్గర కొట్టడం
తిట్టడం జరుగదు.
రెస్టారెంట్


'మణిపూర్ ని కాపాడి.. దేశాన్ని రక్షించాలి'
అని మనం కూడా ఒక పోస్టు పెట్టాల్సోయ్..!!


...మీరు చెప్పిన 'పర్సనల్స్' నాలోనే
దాచుకోవాలంటే ఎగస్ట్రా ఫీజవుతాది..!!

# ఫోటో ఫీచర్



డొమనికా రాజధాని రోసోకు సమీపంలో వున్న మోర్నె ట్రాయిస్ పిటోన్స్ నేషనల్ పార్కులో ఉంది ఈ మురుగునీటి సరస్సు. ఇందులోని నీరు మరుగుతూ పొగలు కక్కుతూ ఉంటుంది. డొమనికా పర్యటనకు వచ్చే పర్యాటకులు ఈ సరస్సును సందర్శించడం పరిపాటి.









